PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 185 | విజయవాడ, సోమవారం 6 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 6 February 2023 | Rs

దేశాభివృద్ధికి ప్రజారవాణా జీవనాడి

- విద్యుత్ బస్సులను ఆర్‌టిసిలకే అప్పగించాలి
- ఆర్‌టిసిపై పన్నులు, టోల్ చార్జీలను మోపొద్దు
- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ డిమాండ్

• లోపలి పేజీలో.. •

బిబిసి డాక్యుమెంటరీపై నిషేధం పౌర హక్కులను కాలరాయటమే

- దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు చేటు
- 500 మందికిపైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు



• లోపలి పేజీలో.. •



సచివాలయ ఉద్యోగుల

సెలవుల రద్దు

- బకాయిల వసూళ్ల కోసమంటూ విజయవాడలో ఉత్తర్వులు
- త్వరలో రాష్ట్రమంతా ఇదే విధానం?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యూజర్ ఛార్జీల బకాయిలను వసూలు చేయాలని పేర్కొంటూ వార్డు సచివాలయాల్లో పనిచేసే పలువురు చిరుద్యోగుల సాధారణ సెలవులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆర్థిక సంవత్సరం చివర కావడంతో మార్చి 31లోగా నూరు శాతం బకాయిలను వసూళ్లు చేయాలని, అప్పటి వరకు (59 రోజుల పాటు) అన్ని రకాల సెలవులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామంటూ ఉత్వర్వుల్లో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అత్యవసరమైతే ఎగ్జిక్యూటివ్ అథారిటీ దృష్టికి తీసుకెళ్లి సెలవు తీసుకోవచ్చని ఉత్తర్వులలో పేర్కొన్నప్పటికీ అది అందరికీ సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని మున్సిపాల్టీలు, నగర పాలక సంస్థల్లో యూజర్ ఛార్జీల బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెలాఖరు వరకు ఇదే విధానాన్ని అమలు చేయనున్నారని సమాచారం. ఈ మేరకు ఎక్కడికక్కడ ఉత్తర్వులు జారీ కానున్నాయి. యూజర్ చార్జీలకు సంబంధించి మునిసిపల్‌శాఖ రాష్ట్ర స్థాయిలో గతనెల 18న సమీక్షా సమావేశం నిర్వహించింది. ఆ సమావేశంలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి ప్రతి వార్డు సచివాలయం పరిధిలోని ప్రాపర్టీ ట్యాక్స్, నీటి పన్ను, చెత్తపన్ను, వాటర్ మీటర్ యూజర్ చార్జీలతో పాటు ప్రొఫెషనల్ ట్యాక్స్‌లను నూరు శాతం వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. తాజా ఉత్తర్వుల్లోరనూ అదే విషయం పేర్కొన్నట్లు సమాచారం.

వసూళ్లకు సంబంధించి రెవెన్యూ ఇనెస్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, ఇన్‌డోర్, ఔట్‌డోర్ సిబ్బంది, క్యాష్ కౌంటర్లలో పనిచేసే సిబ్బందికి విజయవాడలో సెలవులు రద్దు చేశారు. అవసరమైతే సచివాలయంలోని ఇతర సిబ్బందిని కూడా వసూళ్లకోసం వినియోగించుకునే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఏకంగా రెండు నెలల పాటు సెలవులు రద్దు చేయడమంటే చిరుద్యోగులను మానసికంగా వేధించడమే అవుతుందనే అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

యూజర్ ఛార్జీల బకాయిల వివరాలు

మొత్తం అర్బన్ లోకల్ బాడీలు	40
యూజర్ ఫీజు డిమాండ్	రూ.263.27కోట్లు
వసూలైంది	93.32కోట్లు
పర్సెంటీజీ	33.32శాతం

సిసిఐ మూసివేత ?

- కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు రూ.లక్ష
- పత్తి రైతుకు 'మద్దతు' ప్రమాదం
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఇప్పటి వరకు పత్తి రైతులకు కొస్తంత అండగా ఉన్న భారత పత్తి సంస్థ (సిసిఐ) మూసివేత బాటలో పయనిస్తోంది. కేంద్ర సంస్థల మూసివేత జాబితాలో సిసిఐని చేరుస్తారన్న భయాందోళనలకు మొన్న మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బలాన్ని చేకూరుస్తోంది. జౌళిశాఖ పరిధిలో గల సిసిఐ, పత్తి పంట ధరలు పతనమైన సందర్భాల్లో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)పై ప్రత్యేకంగా కేంద్రాలు తెరిచి రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. అందుకు సంబంధించిన మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం- ప్రైస్ సపోర్ట్ స్కీం (ఎంఐఎస్-పిఎస్‌ఎస్)కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం కేవలం లక్ష రూపాయలు ప్రతిపాదించింది. 2021-22 బడ్జెట్‌లో ఆ పద్దునకు రూ.8,331 కోట్లు ఖర్చు చేసింది. 2022-23లో రూ.9,232 కోట్లు ప్రతిపాదించింది. సవరించిన బడ్జెట్‌లో రూ.780 కోట్లకు కేటాయింపులు కోసింది. వచ్చే ఏడాదికి కేవలం రూ.లక్ష మాత్రం ప్రతిపాదించింది. ఈ పరిణామంతో సిసిఐ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర చర్యలతో పత్తి పండించే రాష్ట్రాలు, రైతుల్లో ఆందోళన పెరిగింది. కార్పొరేషన్‌ను పూర్తిగా ఎత్తేయడమో లేదంటే వేరే



	Actual 2021-2022 Revenue	Capital	Total	Budget 2022-2023 Revenue	Capital	Total	Revised 2022-2023 Revenue	Capital	Total	Budget 2023-2024 Revenue	Capital	Total
Central Sector Schemes/Projects												
8. Amended Technology Upgradation Fund Scheme(ATUFS)	625.31	...	625.31	650.00	...	650.00	650.00	...	650.00	900.00	...	900.00
9. Procurement of Cotton by Cotton Corporation under	8331.96	...	8331.96	9243.09	...	9243.09	780.71	...	780.71	0.01	...	0.01

MINISTRY OF TEXTILES
DEMAND NO. 98
Ministry of Textiles
(In ₹ crores)

కార్పొరేషన్‌లో విలీనం చేయడమో చేస్తారని చెబుతున్నారు. జూట్ కార్పొరేషన్ పరిధిలో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

సహాయ నిరాకరణ

1956- కంపెనీల చట్టం కింద 1970లో సిసిఐ ఏర్పాటైంది. మార్కెట్‌లో ధరలు పతనం అయినప్పుడు రైతుల నుంచి ఎంఎస్‌పిపై ముడి పత్తిని కొనుగోలు చేయడం, దేశీయ జౌళి పరిశ్రమల అవసరాలకు సరఫరా చేయడం, మిగిలిన పత్తిని విదేశాలకు ఎగుమతి చేయడం సంస్థ ప్రధానోద్దేశం. నష్టాలొస్తే వాటిని కేంద్రం భరించాలి. దేశ వ్యాప్తంగా నాలుగు జోన్లు, 19 బ్రాంచిలు, 400 పైన పత్తి కొనుగోలు కేంద్రాలను సిసిఐ నడుపుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక సిసిఐకి కేంద్ర సహాయం తగ్గుతూ వచ్చింది. అంతర్జాతీయ ధరల్లో హెచ్చుతగ్గులు, రైతుల నుంచి పంట కొనుగోళ్లు, అన్నింటికీ మించి విదేశాల నుంచి దిగుమతులు వచ్చిపడటంతో సిసిఐ నష్టాల్లోకి చేరింది. నష్టాలను భరించకుండా పేరబెట్టడంతో సంస్థ ఆర్థిక పరిస్థితి దిగజారింది. కార్పొరేట్ల లాభాలకు రైతులను బలిపెట్టేందుకు ఏకంగా సిసిఐని మూసివేసేందుకు నిర్ణయించి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని చెబుతున్నారు.

రాష్ట్ర రైతుకు నష్టం

పత్తిని గణనీయంగా సాగు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. పైగా ఏడాదికేడాది సాగు పెరగడంతో పాటు కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోంది. కౌలు రైతులు పత్తిని అధికంగా సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో 17 లక్షల ఎకరాల్లో వేశారు. 55 లక్షల క్వింటాళ్ల ముడి పత్తి దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కర్నూలు, నంద్యాల, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, విజయనగరం తదితర జిల్లాల్లో పత్తి ఎక్కువ సాగవుతోంది. పత్తి ధరలు జూదాన్ని తలపిస్తున్నాయి. ఆ క్లిష్ట సమయంలో రైతులకు కాస్తంత ఎంఎస్‌పి గ్యారంటీ ఇచ్చేవి సిసిఐ కేంద్రాలు. రాష్ట్రంలో పండే పత్తిలో 40 శాతం వరకూ సిసిఐ కొంటోంది. సిసిఐని మూతేస్తే పత్తి రైతులు మరింత నష్టపోతారు. కేంద్రం సిసిఐకి బడ్జెట్ కేటాయింపులు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వంలో స్పందన లేదు.

కెజిబివి సిబ్బందితో వైసిపి ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం

- సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి నిర్వాకంపై టీచర్ల ఆగ్రహం

• లోపలి పేజీలో.. •

కానిస్టేబుల్ పరీక్షాఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 22న పోలీసు నియమకాల కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆదివారం విడుదల చేసింది.

మొత్తం 4,59,182 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా వారిలో 95,208 మంది ఉత్తీర్ణులైనట్లు బోర్డు వెల్లడించింది. క్వాలిఫై అయిన వారిలో పురుషులు 77,876మంది, మహిళలు 17,332 మంది వున్నారు. క్వాలిఫై అయిన అభ్యర్థులకు స్టేజ్ టు ఆన్ లైన్ అప్లికేషన్ దరఖాస్తును ఈ నెల 13వ తేదీ సాయంత్రంలోపు సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైనవారు 9441450639, 9100203323కు లేదా slprb.ap.gov.in మెయిల్‌లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.



బాల్య వివాహాల పేరుతో 2,200 మందికి పైగా అరెస్టు

• లోపలి పేజీలో.. •

ఒపిఎస్ కోసం సంకల్పం

రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యాన దీక్షలు

- మద్దతు పలికిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీ అభ్యర్థులు
- సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి- యంత్రాంగం

కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం సంకల్ప దీక్ష చేపట్టారు. కలెక్టరేట్ల వద్ద, యుటిఎఫ్ కార్యాలయాల్లో ఒక్క రోజు దీక్షకు దిగారు. గత ఎన్నికల ముందు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. సంకల్ప దీక్షలో పలువురు వక్తలు మాట్లాడుతూ రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో హామీ ఇవ్వకుండానే సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేశారని తెలిపారు. హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి మాట తప్పడం సరికాదన్నారు. సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించకపోతే భవిష్యత్తులో కలిసొచ్చే సంఘాలతో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం జిఓ-1ని తీసుకొచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేసే హక్కును



యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన సంకల్ప దీక్షలో మాట్లాడుతున్న ఎన్.వెంకటేశ్వర్లు

కాలరాసిందని విమర్శించారు. ఆ జిఒని అడ్డుపెట్టుకొని ప్రభుత్వం రోడ్డుపైకి ఎవరినీ రానీయకుండా, పోరాటాలు చేయనీయకుండా నిర్బంధాలను విధించి అక్రమంగా అరెస్టు చేస్తోందన్నారు. వెంటనే జిఒ-1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ఉద్యమిస్తున్న వారిపై నిర్బంధం తగదన్నారు. విజయవాడలో ఈ నెల మూడున నిర్వహించిన సంకల్ప దీక్షకు ప్రభుత్వం పలు విధాలుగా అడ్డంకులు సృష్టించిందని, నాయకులను నిర్బంధించిందని, అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో ఉంచిందని, ఇటువంటి చర్యలు తగవని అన్నారు. ఈ దీక్షలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఎన్‌జిఒ సంఘం నాయకులు, సిపిఎం, సిఐటియు, ఎల్ఐసి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర

మిగతా 2లో



పాక్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ మృతి


దుబాయ్ : గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఆర్మీ చీఫ్ పర్వేజ్ ముషారఫ్ (79) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన దుబాయ్‌లోని అమెరికన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. 1999లో నవాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి సైనిక పాలకుడిగా పగ్గాలు చేపట్టారు. 2001 నుంచి 2008 వరకు పాకిస్థాన్ అధ్యక్షుడిగా పనిచేశారు. అభిశంసనను తప్పించుకొనేందుకు తన పదవికి రాజీనామా చేశారు. ఆయనపై దేశద్రోహం అభియోగాలు నమోదవడం, రాజ్యాంగాన్ని సస్పెండ్ చేసినందుకు 2019లో మరణశిక్ష పడింది. ఆ తరువాత ఆ శిక్ష తాత్కాలికంగా వేశారు. 2016లో దుబాయి వెళ్లిన ముషారఫ్ అప్పటి నుంచి అక్కడే ఆశ్రయం పొందుతున్నారు.

దేశంలో ప్రధాని దందా

- ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు అవసరం
- మోడీ పాలనలో లాభాలు ప్రయివేటుకు, నష్టాలు ప్రజలకు..
- అదానీ లాభాల కోసమే బొగ్గు దిగుమతి
- నాందేడ్ ప్రెస్‌మీట్‌లో తెలంగాణ సిఎం కెసిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రధాని దందా నడుస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ విమర్శించారు. దేశంలో పేదరికం నిర్మూలించాలంటే ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు జరగాలని తెలంగాణ పేర్కొన్నారు. చైనా, సింగపూర్, మలేషియా, దక్షిణ కొరియా మాదిరిగా చేయాలన్నారు. ప్రస్తుతం దేశంలో పన్నుల పేర పేదల నుంచి లాగడం, పెద్దలకు వదలడం చేస్తున్నారని, ఇదిసరైన విధానం కాదని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ తన మిత్రుల వ్యాపారం కోసం విదేశీ కంపెనీలను దేశానికి రాకుండా మోకాలడ్డుతున్నారని విమర్శించారు. అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే విద్యుత్తు రంగాన్ని జాతీయం చేస్తామని, ఎల్ఐసిని పూర్తిగా ప్రభుత్వపరం చేస్తామని తెలిపారు. మోడీ




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కెసిఆర్

పాలనలో నష్టాల ప్రజలకు, లాభాలు ప్రయివేటువాళ్లకు వెళ్తున్నాయని విమర్శించారు. విభజిత, విద్వేష రాజకీయాలను వ్యతిరేకిస్తామని తెలిపారు. మహారాష్ట్రంలోని నాందేడ్‌లో ఆదివారం బిఆర్‌ఎస్ బహిరంగ సభ అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెసిఆర్ మాట్లాడారు. ప్రస్తుతం దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని, ఈ స్థితిలో

మిగతా 2లో

చైనా బెలూన్ కూల్చేసిన అమెరికా



వాషింగ్టన్, బీజింగ్ : పొరపాటున అమెరికా గగనతలంలోకి ప్రవేశించిన చైనాకు చెందిన వాతావరణ పరిశోధన బెలూన్‌ను యుద్ధ విమానంతో అమెరికా కూల్చివేసింది. అమెరికా చర్యను చైనా 'ఓవర్ రియాక్షన్' (అతి స్పందన)గా అభివర్ణించింది. తమ దేశంలో వాతావరణ పరిశోధనలకోసం ప్రయోగించిన మానవ రహిత బెలూన్ పొరపాటున అమెరికా గగన తలంలోకి ప్రవేశించిన విషయాన్ని ముందుగానే తెలియచేశామని, అయినా కూల్చివేయడంతో అమెరికాపై తగిన చర్యలు తీసుకునే హక్కు తమకుందని పేర్కొంది. దోమపై ఫిరంగితో దాడిచేయడంగా చైనా సైనిక నిపుణులు ఈ చర్యను పేర్కొన్నారు. మరోవైపు అమెరికా తన చర్యను సమర్థించుకుంది. బెలూన్‌ను చైనా గూఢాచర్యానికి వాడుతోందని అమెరికా ఆరోపించింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ 'బెలూన్ గురించి సమాచారం తెలియగానే వీలైనంత త్వరగా కూల్చివేయాలని ఆదేశించాను. దాని శకలాల కారణంగా భూమిపై నష్టం జరుగుతుందేమోనని వేచిచూశారు. అది భూభాగం దాటి సముద్రంపైకి వెళ్లిన వెంటనే అమెరికా ప్రాదేశిక జలాల పరిధిలోనే కూల్చివేయాలని నిర్ణయించారు. దాన్ని విజయవంతంగా అమలు చేసిన మా ఏవియేటర్లను అభినందిస్తున్నాను' అని అన్నారు. బెలూన్ దక్షిణ కరోలినా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రంలో కూలిపోయిందని స్థానిక మీడియా నివేదించింది. అంతర్జాతీయ సైనిక నిపుణులు కూడా అమెరికా చర్యను తప్పుపడుతున్నారు. పరిశోధనలకు, సైనిక చర్యలకు మధ్య తేడానే గుర్తించలేని స్థితిలో అమెరికా ఉందా? అని నిపుణులు ప్రశ్నించారు. రాజకీయ బల ప్రదర్శనగానే వారు దీనిని భావిస్తున్నారు.

కేంద్రం తీరు ఆక్షేపణీయం

- 'అప్పర్ భద్ర'తో రాయలసీమకు తీవ్ర నష్టం
- ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముంది
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ఎటువంటి అనుమతులూ లేకుండా కర్ణాటక చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించడం ఆక్షేపణీయమని, ఇది రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం చేకూర్చడమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. తక్షణం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా ఐక్యంగా పోరాడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. 'అప్పర్ భద్ర నిర్మాణం-జిల్లా నీటి వనరులకు ప్రమాదం' అనే అంశంపై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైసిపి, బిజెపి మినహా టిడిపి, సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, కాంగ్రెసు పార్టీల నాయకులతోపాటు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

సంఘాలు, ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు హాజరయ్యారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ అప్పర్ భద్ర ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడాన్ని బచావత్ ట్రిబ్యునల్ ఆనాడే వ్యతిరేకించిందని గుర్తు చేశారు. నదీ జలాల మళ్లింపు ద్వారా వచ్చే మిగులు జలాల పేరుతో ఇప్పుడు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు పెట్టినా, ఇంకా అది న్యాయస్థానం పరిధిలోనే ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల సుమారు 40 టిఎంసిల వరకు నీటిని ఎగువ భాగం (కర్ణాటక)లోనే తోడేసుకునే అవకాశముందన్నారు. దీనివల్ల తుంగభద్ర డ్యాముకు నీరు చేరడంలో ఆలస్యమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ కర్ణాటకలో త్వరలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అప్పర్ భద్రకు కేంద్ర ప్రభుత్వం రూ.5,300 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో ఒకటిగా ఉన్న పోలవరం ప్రాజెక్టుకు మాత్రం 2011 నాటి ధరలతోనే నిధులు కేటాయిస్తామని చెబుతూ, అప్పర్ భద్రకు మాత్రం కొత్త ధరలకనుగుణంగా నిధులు కేటాయించడం బిజెపి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని తెలిపారు. పక్క రాష్ట్రాల అభ్యంతరాలను, సిడబ్ల్యుసి (సెంట్రల్ వాటర్ కమిషన్) నియమాలను

మిగతా 2లో

232 లోన్, బెట్టింగ్ యాప్‌ల నిషేధం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో 138 బెట్టింగ్ యాప్‌లు, 94 రుణ యాప్‌లను నిషేధించాలని, మరికొన్నింటిని బ్లాక్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 232 యాప్స్‌పై తక్షణ, అత్యవసర ప్రాతిపదికన ఈ చర్యకు సిద్ధమైనట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఐటి చట్టంలోని సెక్షన్ 69 కింద భారత సార్వభౌమత్వం, సమగ్రత పట్ల పక్షపాతంగా వ్యవహరించే ఉద్దేశాలను ఈ యాప్‌లలో గుర్తించడంతో ఈ చర్య తీసుకున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. లోన్ యాప్‌లు దోపిడీకి గురిచేస్తున్నాయని, అసభ్యకరమైన సందేశాలను పంపించడం, మార్ఫింగ్ చేసిన ఫొటోలను కాంటాక్ట్ నంబర్లకు పంపించడం ద్వారా అవమానానికి గురిచేస్తున్నాయని ఐటీ మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణసహా పలు రాష్ట్రాల్లో బాధితులు ఆత్మహత్యలకు పాల్పడిన పలు ఘటనలు వెలుగు చూశాయి. జూన్ 2020 నుంచి టిక్‌టాక్, షేర్ఇట్, వీచాట్‌సహా రెండు వేలకుపైగా యాప్‌లను కేంద్రం నిషేధించింది. ఆరు నెలలక్రితం 28 లోన్ యాప్‌లపైనా నిషేధం విధించింది. తాజాగా మరో 94 యాప్‌లు థర్డ్-పార్టీ లింక్స్ ద్వారా ఈ-స్టోర్స్‌లో లభ్యమవుతున్న నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది.

నర్సింగ్ వ్యవస్థపై బాలకృష్ణ వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రాణాలను కాపాడే నర్సింగ్ సేవలను కించపరచడమే కాకుండా వారి మనోభావాలను దెబ్బతీసేలా "ఆహా" కార్యక్రమంలో సినీనటుడు బాలకృష్ణ వ్యాఖ్యానించడాన్ని స్టేట్ గవర్నమెంటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సెస్ యూనియన్ రాష్ట్ర కమిటీ (ఎపిఎస్‌జిసిఓఎస్ఎస్‌యు), ఎపిఎస్‌సిఓఇఫ్ ఖండించింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ డి దయామణి, ప్రధానకార్యదర్శి జి భవాని, కోశాధికారి డి వేణుగోపాలాచారి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలకృష్ణ తక్షణమే నర్సుల పట్ల మాట్లాడిన మాటలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఖేలో ఇండియాలో 19వ స్థానంలో రాష్ట్రం

- పిస్టల్ షూటింగ్‌లో స్వర్ణం

విజయవాడ : మధ్యప్రదేశ్‌లో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (కెఐవైజి)–2022 పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచింది. ఆదివారం నాడు ఒక స్వర్ణంతో పాటు మొత్తం ఐదు మెడల్లను సాధించింది. ఈ క్రీడల్లో 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పాల్గొన్నాయి. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన అథ్లెట్లు నాలుగు క్రీడాంశాల్లో సత్తా చాటి ఆదివారం ఒక స్వర్ణం, ఒక రజతం, మూడు కాంస్య పతకాలు సాధించారు. అండర్ 18 బాలుర షూటింగ్ విభాగంలో 10 మీటర్ల పిస్టల్ షూటింగ్‌లో ముఖేష్ స్వర్ణం సాధించారు. వ్యక్తిగత ఆర్చరీ అండర్ 18 విభాగంలో గణేశ్ మణిరత్నం రజత పతకం సాధించారు. అలాగే 71 కిలోల బాక్సింగ్ కేటగిరీలో అంజని కుమార్ ముమ్మన, 52 కిలోల బాక్సింగ్ ఈవెంట్‌లో మహ్మద్ మెహరున్నీస్సా బేగం, బ్యాడ్మింటన్‌లో జాహ్నవి, నవ్య కొండేరి రాష్ట్రానికి కాంస్య పతకాలు సాధించారు. వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, కబడ్డీ, జుడో, టెన్నిస్, స్విమ్మింగ్ తదితర క్రీడాంశాల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటే వీలుంది. ఈ నెల 11న ఈ క్రీడలు ముగియనున్నాయి. ఖేలో ఇండియాలో 2019 నుంచీ పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ దిగువనే కొనసాగుతోంది.

దోపిడి కోసమే 'మద్యం' డిజిటల్ చెల్లింపులకు నో

- టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యంపై అక్రమ ఆదాయం దండుకునేందుకే సిఎం జగన్ ప్రభుత్వం మద్యం షాపుల్లో డిజిటల్ చెల్లింపులకు అనుమతించటం లేదని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. వీధి వ్యాపారులు సైతం గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా డిజిటల్ పేమెంట్స్ అనమతిస్తుంటే...మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ తీసుకోవడానికి ప్రభుత్వానికి ఇబ్బందేంటని ఒక ప్రకటనలో అనగాని ప్రశ్నించారు. గతంలో ప్రైవేట్ మద్యం షాపులు ఉన్నప్పుడు డిజిటల్ పేమెంట్లు జరిగేవని తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు వచ్చాక పాలసీ మార్చి జిఎస్టి, ట్యాక్సులు కట్టకుండా జగన్ వేలకోట్లు దిగమింగేందుకు డిజిటల్ పేమెంట్లు తీసుకోవటం లేదని విమర్శించారు. అన్ని మద్యం షాపుల్లో త్వరలో డిజిటల్ రూపంలో చెల్లింపుల విధానాన్ని అమలు చేస్తామని ఎపి బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ 2021 అక్టోబర్ 1 వ తేదిన హైకోర్టు నివేదించిందని తెలిపారు. ఇప్పుడు 11 షాపుల్లో మాత్రమే అనుమతించారని విమర్శించారు.

కేంద్రం తీరు ఆక్షేపణీయం

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోకుండా ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి నష్టం చేకూర్చే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో అనుమతుల్లేని ప్రాజెక్టుకు రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే కేంద్రంలోని బిజెపి నిధులు కేటాయించిందన్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్‌ఎం.బాషా మాట్లాడుతూ ఎటువంటి అనుమతులూలేని అక్రమ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి జాతీయ హోదా కల్పించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. జల సాధన సమితి నాయకులు గంగిరెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యపై ప్రజాప్రతినిధులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. క్షేత్ర స్థాయి నుంచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి పెద్ద పోరాటాన్ని రూపొందించడం ద్వారానే ఈ ప్రాంతానికి జరిగే అన్యాయాన్ని ఆపగలమని పేర్కొన్నారు.

దేశాభివృద్ధికి ప్రజారవాణా జీవనాడి

- విద్యుత్ బస్సులను ఆర్‌టిసిలకే అప్పగించాలి
- ఎస్‌టియులను ప్రయివేటీకరించొద్దు
- ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశాభివృద్ధికి ప్రజారవాణా వ్యవస్థ జీవనాడి లాంటిదనీ, అలాంటి వ్యవస్థను నిర్వీర్యం చేసే ఆలోచనలను కేంద్రం వెనక్కి తీసుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో స్టేట్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ సెక్టార్ (ఎస్‌టియు) ప్రతినిధుల సభను నిర్వహించారు. ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయనేత జీవన్‌సాహా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌టియుల కన్వీనర్ అర్మూదనయనార్ నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న నయా ఉదార విధానాలను మొదట ప్రయోగించింది ప్రజా రవాణా రంగంపైన్నేనని తెలిపారు. అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌టిసి సంస్థలకు ఇచ్చే మూలధన పెట్టుబడిని నిలిపివేశాయని తెలిపారు. వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు బస్సు ఆపరేటర్లకు లబ్ది చేకూర్చడం కోసం ఆర్‌టిసి బస్సులను కుదిస్తూ పోతున్న తీరును ఆయన వివరించారు. ఆర్‌టిసిపై కోవిడ్ ప్రభావం కూడా పడిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను మొత్తంగా ప్రయివేటు గుత్త కంపెనీలకు (ఊబర్, ఓలా, తదితరాలకు) అప్పగించడమే లక్ష్యంగా ముందుకెళు తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే మోటారు వాహనాల చట్టం-2019 తీసుకొచ్చిందన్నారు. విద్యుత్ బస్సులను తీసుకురావడం, బల్క్ డీజిల్ సప్లయ్‌పై భారాన్ని మరింత మోపడం, ఒకేదేశం–ఒకే పర్మిట్ విధానం తేవడం, ప్రయాణికులపై విపరీత చార్జీల భారం, ఆర్‌టిసి సిబ్బందిపై విపరీత పనిభారం మోపడం, నూతన విధానాలు తీసుకురావడం వంటి చర్యలన్నీ ప్రయివేటీకరణ దిశగా వేస్తున్న అడుగుల్లో భాగమేనని విమర్శించారు. ప్రజారవాణా వ్యవస్థను దెబ్బతీయడం అంటే పర్యావరణ సమస్యలను ఏరికోరి తెచ్చుకోవడమేనని చెప్పారు. అర్మూద నయనార్ మాట్లాడుతూ.. ప్రజలకు తక్కువ ఖర్చుతో భద్రతతో కూడిన ప్రయాణం అందించేందుకే ఎస్‌టీయూలు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా అవి సంక్షోభంలో ఉన్నాయనీ, వాటి పరిరక్షణ కోసం, సిబ్బంది హక్కుల కోసం జాతీయ స్థాయిలో ఐక్య ఉద్యమ నిర్మాణం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. దేశంలోని 90 శాతం ప్రయాణికులు రోడ్డు మార్గం ద్వారానే ప్రయాణిస్తున్నారనీ, 60 శాతం సరుకు రవాణా కూడా ఇదే మార్గం ద్వారా కొనసాగుతున్నదని వివరించారు. దేశంలో ఏటా లక్షన్నర మంది చనిపోతున్నారనీ, ప్రయివేటు వాహనాల ప్రమాదాల్లోనే మరణాలు ఎక్కువగా ఉంటున్నాయని వివరించారు. ప్రజారవాణా రంగంపై ఖర్చుపెట్టే ప్రతి డాలర్ కూడా జీడీపీని నాలుగు డాలర్లకు పెంచుతుందంటూ వరల్డ్ ఎకనామిక్ సెంటర్ నొక్కి చెబుతున్న విషయాన్ని ప్రస్తావించారు. గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కోవడానికి, ప్రమాదాలను తగ్గించడానికి ఏకైక మార్గం ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనన్నారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి వీఎస్‌రావు మాట్లాడుతూ..ఆర్టీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేయాలనీ, సబ్సిడీలను తిరిగి చెల్లించాలని కోరారు. ఈ మీటింగ్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ కోశాధికారి హరిక్రిష్ణన్, కార్యదర్శులు వినోద్, కొప్పుస్వామి, ఇంద్రకుమార్ బందానా, జాతీయ నాయకులు పి.రవీందర్‌రెడ్డి, 27 రాష్ట్రాల నుంచి 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవే...

- ఆర్టీసీ చట్టం 1950 ప్రకారం మూలధన పెట్టుబడిని పునరుద్ధరించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.
- డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం, అమ్మకం పన్ను నుంచి ఎస్టీయూఎస్‌లను మినహాయించాలి.
- ఆర్టీసీ బస్సులకు టోల్ చార్జీల నుంచి మినహాయింపునివ్వాలి.
- విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతను ఆర్టీసీలకే అప్పగించాలి.
- ప్రజా రవానా వాహనాలకు రోడ్లపై ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలి.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- సిపిఎస్ రద్దు చేయాలి : వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న ఉద్యోగుల నూతన పెన్షన్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్రచైర్మన్ వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. నంద్యాల మార్కెట్ యార్డ్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ సభ నిర్వహించారు. ఈ సభలో వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవ-పాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు హాజరై ఉద్యోగులకు ప్రభుత్వం నుండి అందాల్సిన అన్ని అంశాలపైన చర్చించారు. అనంతరం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పిఆర్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వాలని, జిపిఎఫ్, ఎపిజిఎఫ్ పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తే ఎల్లవేళలా ఉద్యోగులు ప్రభుత్వం వెంటే ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఉద్యోగులు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గుణదలకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి - అమరావతి

విజయవాడలోని గుణదల మేరీ మాత ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల 'యువజనుల ప్రార్థన'ల్లో భాగంగా ఆరవ రోజు కావడం, పైగా సెలవు రోజు కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గుణదల కొండపై ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిషప్ రెవ టి జోసెఫ్ రాజా రావు నేతృత్వంలో జరిగిన ఈ ప్రార్థనలకు హెరాల్డ్ ఆఫ్ గుడ్ న్యూస్, ఆంధ్ర ప్రాంతీయ రెవరెండ్ ఫ్రాన్సిస్ బత్తుల జయరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత జనవరి 31న ప్రారంభమైన ఈ ప్రార్థనలు ఈ నెల 8న ముగియనున్నాయి. అనంతరం ఇదే నెల 9 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మేరీమాత ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

హామీలిచ్చి మోసం చేశారు

- కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదే..
- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి బిసిలతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఆదివారం ఉదయం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లి నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్ర ఐరాల, కాణిపాకంలో సాగింది. కాణిపాక వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. పాదయాత్రగా వచ్చిన లోకేష్‌కు మహిళలు హారతులు పట్టారు. టిడిపి శ్రేణులు అడుగడుగునా పూలమాలలు వేస్తూ ఘనస్వాగతం పలికాయి. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ యువరాజులు నాయుడు, యువత పెద్దసంఖ్యలో లోకేష్ వెంట నడిచారు. తవణంపల్లి వద్ద గాండ్ల సామాజిక వర్గీయులు లోకేష్‌తో సమావేశమయ్యారు. గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. లోకేష్ స్పందిస్తూ గాండ్ల కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో భాగంగా కాణిపాకంలోని సిడిఎం కళ్యాణ మండపంలో బిసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం బిసిల అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. కార్పొరేషన్లు ఏర్పాటు



పాదయాత్రలో నారా లోకేష్..

చేసినంత మాత్రన సరిపోదని, నిధులు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్‌లకు నిధులు మంజూరు చేయకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. బిసిలంతా ఏకతాటిపై నిలబడి అరాచక సైకో ముఖ్యమంత్రికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాణిపాకం నుంచి ప్రారంభమైన పాదయాత్ర చిత్తూరు నగర శివార్లలోని పంట్రంపల్లి వద్దకు చేరుకుంది. రాత్రి అక్కడే బసచేశారు. సోమవారం ఉదయం పంట్రంపల్లి నుంచి ప్రారంభమై చిత్తూరుకు చేరుకోనుంది.

ఆర్థికస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా?

- బుగ్గనకు యనమల సవాల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థికస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము వైసిపి ప్రభుత్వానికి ఉందా? అని శాసనమండలి ప్రతిపక్షనేత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఆర్థిక శాఖలో ఏం జరుగుతుందో కనీసం బుగ్గనకైనా తెలుసా? అని ఆయన ఎద్దేవా చేశారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక శాఖపై పెత్తనమంతా ముఖ్యమంత్రి జగన్‌దేనని పేర్కొన్నారు. ఏమాత్రం అవగాహన ఉన్నా తనతో చర్చకు రావాలని సవాలు విసురుతూ ప్రశ్నల వర్షం కురిపించారు.

మూడున్నరేళ్ల వైసిపి పాలనలో బహిరంగ మార్కెట్ ద్వారా తీసుకొచ్చిన అప్పు ఎంత? ఆర్బిఐ నుంచి తీసుకున్న వేస్ అండ్ మీన్స్ ఎంత? ఓవర్ డ్రాఫ్ట్ ఎంత? వడ్డీ ఎంత? రెవెన్యూ, ప్రాథమిక, ద్రవ్యలోటు ఎంత? మూడున్నరేళ్లల్లో ఖర్చు చేసిన మూలధన వ్యయం ఎంత? పీడి అకౌంట్‌లో నిధులు ఎంత వాడారు? పెండింగ్ బిల్స్ ఎన్ని ఉన్నాయి, ఉద్యోగులకు జీతాలు, జిపిఎఫ్, పిఆర్‌సి ఎందుకు ఇవ్వడంలేదు? ఓపెన్ బారోయింగ్స్, ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ ఎంత? వీటి వివరాలు కాగ్‌కు కూడా ఎందుకివ్వడం లేదు అని యనమల వరుస ప్రశ్నలు సంధించారు. అధిక ద్రవోల్బణం ఉన్న రాష్ట్రాల్లో రాష్ట్రం 2వ స్థానంలో ఉందని విమర్శించారు. వీటన్నిటిపై సమగ్రంగా ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిఎంకు ధైర్యం ఉంటే తనతో బహిరంచ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

దేశంలో ప్రధాని దందా

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నామని కేంద్ర నేతలు ప్రకటించడం బూటకమని పేర్కొన్నారు. దేశంలోని బొగ్గు నిల్వలతో 125 ఏళ్లపాటు యావత్ దేశానికి విద్యుత్తు అందించవచ్చని తెలిపారు. దేశ అభివృద్ధికి విద్యుత్తు రంగం కీలకమని, కుంటిసాకులతో ఈ రంగాన్ని ప్రయివేటుపరం చేస్తున్నారని అన్నారు. విద్యుత్తు రంగం పూర్తిగా ప్రయివేట్‌వాళ్ల చేతికి వెళ్తే, భవిష్యత్తులో దేశాన్ని, సర్కారును బ్లాక్‌మెయిల్ చేస్తారని హెచ్చరించారు. లక్షల కోట్ల రూపాయల ఆస్తిని కేవలం వందల కోట్లకు ప్రయివేటుపరం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ హన్స్ కంపెనీని ఉదహరించారు. ఈ కంపెనీతో ప్రభుత్వానికి దక్కే డివిడెంట్ కంటే తక్కువకు ప్రయివేటీకరణ చేశారని తెలిపారు. ఇష్టం వచ్చినట్టు ప్రయివేటీకరణ చేస్తే ఊరుకోబోమని, 2024 తర్వాత బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ జాతీయం చేస్తామని అన్నారు. బొగ్గు రంగంలోనూ ఇదే విధంగా వ్యవహరించారని విమర్శించారు. దేశంలో పెద్ద ఎత్తున బొగ్గు నిక్షేపాలున్నాయని, కిలో బొగ్గు కూడా దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కానీ ప్రధాని మోడీ... తన మిత్రుడు అదానీ కోసం రాష్ట్రాలను భయపెట్టి బలవంతంగా ఆస్ట్రేలియా నుంచి బొగ్గు దిగుమతి చేయిస్తున్నారని విమర్శించారు. కోల్ ఇండియా కంపెనీకి అవసరమైన రైలు పట్టాలను వేయడం లేదని దుయ్యబట్టారు. ఎల్‌ఐసిని నిర్వీర్యం చేస్తున్నారని, అదానీ కంపెనీల్లో రూ.87 వేల కోట్లు పెట్టుబడి పెట్టించారని, పైగా నష్టం జరగలేదని బూటకపు ప్రకటనలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పెద్ద కుంభకోణమని, ఒకవేళ నష్టం జరగకపోతే అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

మహిళలకు చట్టసభల్లో 35 శాతం ప్రాతినిధ్యం

మహిళలకు పార్లమెంట్‌లో, అసెంబ్లీ, కౌన్సిల్‌లో 35 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని కెసిఆర్ ప్రకటించారు. దేశంలో రాజకీయ విధానం, ప్రభుత్వ పరిపాలన ఇలా అన్ని రంగాల్లో మార్పు జరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మోడీ మిత్రుడు కాబట్టే అదానీ రెండేళ్లలో ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానంలోకి వచ్చారని పేర్కొన్నారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసని, దీన్ని ఇంకా దాచలేరని అన్నారు. నీటి వివాదాలకు భాగస్వామ్య పక్షాలతో చర్చించి పరిష్కరిస్తే సరిపోతుందని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. మహారాష్ట్రకు నీటి అవసరం ఉంటే ఎస్సారె-స్పీ నుంచి కూడా లిఫ్ట్ చేసుకోవచ్చని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న రమాప్రభ, చిన్నారులు

'ఉక్కు' పరిరక్షణ దీక్షలకు చిన్నారుల మద్దతు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటానికి చిన్నారులు తోడయ్యారు. వారంతా ఒక్కటై వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం రిలే దీక్షకు దిగారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 675వ రోజుకు చేరాయి. దీక్షల్లో కూర్చున్న చిన్నారులను ఉద్దేశించి విసిసి వ్యవస్థాపకులు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ బడ్జెట్‌లోనూ నామమాత్రంగానే కేటాయింపులు చేసిందని తెలిపారు. ప్లాంట్ విస్తరణ, కొత్త వారికి ఉపాధి కల్పన కోసం ఏమాత్రమూ సహకరించడం లేదన్నారు. కర్మాగారం లాభాల్లో నడుస్తున్నా అమ్మేయాలని చూడడం దారుణమని తెలిపారు. ప్రభుత్వ రంగం ఉంటేనే భవిష్యత్తు తరాలకు ఉపాధి, ఉద్యోగ భద్రత ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో విసిసి నగర నాయకులు ఎల్లాజీ, సంతోష్, వేణు, అఖిల్, మానస, యువరాజు, ప్రదీప్, భార్గవ్, శ్రీనివాస్, గౌతమ్, శ్రావ్య, మధులత, మోహన్, త్రినాధ్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు, నిర్వాహకులు

ఉత్సాహంగా ముగిసిన హేలాపురి బాలోత్సవం

- విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని సర్ సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో పెద్దఎత్తున జరిగిన హేలాపురి బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు ఆదివారం సాయంత్రం ఉత్సాంగా ముగిశాయి. రెండు రోజులపాటు 60 అంశాల్లో జరిగిన కల్చరల్, అకడమిక్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన బహుమతుల ప్రదానోత్సవ సభ ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఇమ్మానియేల్, అటవీశాఖ డిప్యూటీ రేంజర్ ఎం.హిమశైలజ పాల్గొని మాట్లాడారు. బాలోత్సవం పేరుతో పిల్లల సంబరాలు పెద్దఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి పాఠశాల పరిధిలో బాలోత్సవాలు నిర్వహించాలని సూచించారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదోక ప్రతిభ ఉంటుందని, ఆ ప్రతిభను గుర్తించి వారికి తగిన తర్ఫీదు ఇస్తే ఆయా రంగాల్లో వారు నిష్ణాతులుగా తయారవుతారని తెలిపారు. కులం, మతం భావన లేకుండా అభ్యుదయ సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవం టైటిల్ సాంగ్ రచయిత శ్రీహరి కోటి, పుష్పరాజ్, రాజ్‌కల్, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కలుషిత నీటివల్లే విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

కలుషిత నీటివల్లే బాలికలు అస్వస్థతకు గురయ్యారని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఇటీవల అనారోగ్యం పాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ పాఠశాలలో వసతులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ కలిసి ఆదివారం పరిశీలించారు. వంట గదులను, డ్రెయినేజీని, శిథిలావస్థకు చేరిన భవనాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు తిన్న ఆహారాన్ని పరీక్షించగా అది కలుషితమైనట్లు నిర్థారణ కాలేదని తెలిపారు. కానీ, వారు తాగిన నీటిలో క్లాప్సెల్లా బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వంట పాత్రలు కడిగే ప్రాంతంలో ఇకోలి బ్యాక్టీరియా ఉన్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు గుర్తించారని, వీటివల్లనే బాలికలు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

ఒపిఎస్ కోసం సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో సంకల్ప దీక్ష జరిగింది. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ఆధ్వర్యాన నిర్వహించిన ఈ దీక్షలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్ప మరిదేన్నీ ఉపాధ్యాయులు,ఉద్యోగులు అంగీకరించబోరని తేల్చి చెప్పారు. 33 శాతం పాత పెన్షన్‌కు ఏ విధంగా సమానమో, జిపిఎస్‌లో మినహాయింపు చేసే 20 శాతం డబ్బులు కార్పొరేట్లు నిర్వహించే ప్రయివేట్ సంస్థల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రభుత్వానికి, ఉద్యోగులకు లాభాలు ఎలా వస్తాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద సంకల్ప దీక్షా శిబిరాన్ని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. జిపిఎస్ వల్ల ప్రభుత్వానికి, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎవరికీ ఎటువంటి ఉపయోగమూ లేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయకపోతే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ప్రారంభించారు. ఏలూరు, భీమవరం దీక్షా శిబిరాల్లో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని గడిచిన కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో అనేక ఆందోళనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఏలూరులో ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్.హరనాథ్ మాట్లాడుతూ హామీని అమలు చేయకపోగా గ్యారెంటీలేని జిజిఎస్ విధానాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకురావడం దారుణమన్నారు. కర్నూలు ధర్నా చౌక్‌లో, నంద్యాల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సంకల్ప దీక్షలను చేపట్టారు. కర్నూలులో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు దీక్షకు మద్దతు తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట సంకల్ప దీక్షకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరై మాట్లాడారు. శ్రీకాకుళంలోని ఎన్‌జిఒ హోం వద్ద యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యాన చేపట్టిన సంకల్ప దీక్షా శిబిరాన్ని ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర ప్రారంభించారు. విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన సంకల్ప దీక్షా శిబిరాన్ని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని నెహ్రూ చౌక్ జంక్షన్‌లో తలపెట్టిన దీక్షకు పలు మండలాల నుంచి ఉపాధ్యాయులు తరలివచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, చింతూరు డివిజన్లలో సంకల్ప దీక్షలు చేపట్టారు. గుంటూరు, విజయనగరం, కడపల్లో కలెక్టరేట్ల వద్ద, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని డిఇఒ కార్యాలయం వద్ద, రాయచోటిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద, మచిలీపట్నం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతిల్లో యుటిఎఫ్ కార్యాలయాల్లో సంకల్ప దీక్షలు నిర్వహించారు.

అధికారంలో ఎవరున్నా బాధితుల పక్షాన పోరాడతాం

- ఎమ్మెల్సీలు విఠపు బాల సుబ్రహ్మణ్యం, కెఎస్.లక్ష్మణరావు
- పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ఒంగోలులో సంఘీభావ సభ



సభలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

అధికారంలో ఎవరు ఉన్నా బాధితుల పక్షాన నిలబడి పోరాడతామని, తాము ఏ ఒక్క వర్గం పక్షాన ఉండబోమని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, కెఎస్.లక్ష్మణరావు అన్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డిలకు సంఘీభావంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ప్రకాశం జిల్లా ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సభ జరిగింది. ఈ సభకు జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు టి.గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సదర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలవకుండా చేయాలని వివిధ పార్టీలు, అనేక శక్తులు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, పట్టభద్రులు, మేధావులు, నేతలంతా సంఘటితమై వారి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలని, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, రామయపట్నం పోర్టును నిర్మించాలని, కనిగిరి నిమ్జ్ ఏర్పాటు చేయాలని, దొనకొండను పారిశ్రామికవాడగా అభివృద్ధి చేయాలని, జిల్లాలో ఫ్లోరిన్ సమస్యను పరిష్కరించాలని అనేక సందర్భాలలో మండలి లోపల, బయట పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాటాలు చేసినట్లు తెలిపారు.

నేడు రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అమ్మేందుకు అడుగులు వేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై పోరాడేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, రాష్ట్ర నాయకులు కొమ్మోజి శ్రీనివాసరావు, యుటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఒ.వి.వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రవి, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తోడేటి సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు

మంత్రి ఎవరి కోసం పనిచేస్తున్నారు

- తన నియోజకవర్గంలోని దళితులపై దాడులు పట్టించుకోరా? : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- భట్టిప్రోలు (కొల్లూరు)

దళితులపై దాడులు జరిగితే స్పందించని స్థానిక మంత్రి ఎవరి కోసం పని చేస్తున్నారో చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతల్లంక, పెదలంక గ్రామాల్లో బాధితులు, పేదల పక్షాన నిలబడి అక్రమ కేసులకు గురై జైలు పాలైన సిపిఎం కొల్లూరు మండల కార్యదర్శి తోడేటి సురేష్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడే కమ్యూనిస్టులకు కేసులు, జైళ్ల కొత్తేమీ కాదని, వాటికి భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. భూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పార్టీ అండగా ఉంటుందన్నారు. దళిత నియోజకవర్గంలో దళితుల సమస్యలు పరిష్కరించాల్సిన స్థానిక మంత్రి తన స్వార్థ ప్రయోజనాల కోసం దళితులపై అధికారులతో అక్రమ కేసులు బనాయింపజేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. భూమి కోసం పోరాటం, ధర్నా చేయడం పేదవాడి ప్రాథమిక హక్కని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం కూడా ఆనాడు ధర్నాలు, సత్యాగ్రహాలతోనే వచ్చిందని గుర్తు చేశారు. భూమి కోసం చదును చేస్తూ పిచ్చికంపను తొలగించడం నేరమా? అని ప్రశ్నించారు. సమస్య పరిష్కారంలో తహశీల్దార్ ఉపేక్ష వల్లే దళితులపై అగ్రవర్ణ పెత్తందార్లు పోలీసుల సాక్షిగా దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ప్రభుత్వ భూములు, ఆర్‌సి భూములు పేదవాడికి అప్పగించాలని చట్టంలో ఉందని తెలిపారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సురేష్‌ను విడుదల చేసి దాడులకు కారణాలపై తగిన విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఆశా మాలవ్యకు గవర్నర్ అభినందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సైకిల్‌పై దేశాన్ని చుట్టివస్తున్న ఆశా మాలవ్యను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా నతారామ్ గ్రామానికి చెందిన మాలవ్య వివిధ రాష్ట్రాల్లో సైకిల్‌పై పర్యటన చేస్తూ ఆదివారం విజయవాడ చేరుకున్నారు. జాతీయ క్రీడాకారిణిగా, పర్వతారోహకురాలిగా పేరుగాంచిన మాలవ్య మహిళా భద్రత, మహిళా సాధికారికత నినాదాన్ని సమాజంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో సైకిల్ యాత్ర చేపట్టారు. సైకిల్‌పై దేశంలోని 28 రాష్ట్రాల్లో 25 వేల కిలోమీటర్లు తిరగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆమె తెలిపారు. ఎపితో సహా 8 రాష్ట్రాల్లో 8,555 కిలోమీటర్ల సైక్లింగ్ పూర్తయ్యిందని గవర్నర్‌కు ఆమె వివరించారు. చిన్న వయస్సులో సమాజానికి ఉపయోగపడేలా దేశాన్ని చుట్టి వచ్చే ప్రయత్నం చేయడం గొప్ప విషయమని గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్‌సింఘాల్, సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, ఉప కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.

విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు చంద్రబాబు పరామర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల కన్నుమూసిన సినీ దర్శకులు కె విశ్వనాథ్ కుటుంబ సభ్యులను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని విశ్వనాథ్ ఇంటికి ఆదివారం వెళ్లారు. విశ్వనాథ్ చిత్రపటానికి చంద్రబాబు నివాళులర్పించారు. చంద్రబాబుతో పాటు టిడిపి తెలంగాణ మాజీ అధ్యక్షులు బక్కిన నర్సింహులు, సినీ నిర్మాత సి అశ్వనీదత్ ఉన్నారు. కాగా తుని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ యనమల దివ్య చంద్రబాబును ఆదివారం కలిశారు. తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా దివ్యను ఇటీవల టిడిపి నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రబాబును హైదరాబాద్‌లోని కలిసి ధన్యవాదాలు తెలిపారు. దివ్య టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడి కుమార్తె అన్న సంగతి విదితమే.

మతోన్మాద బిజెపిపై పోరాడదాం : అవాజ్

ప్రజాశక్తి-గుంటూరు



మైనార్టీలపట్ల వివక్షత చూపిస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ పిలుపునిచ్చారు. ఆవాజ్ రాష్ట్ర కమిటీ సమావేశం పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.సుభాన్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చిష్టీ మాట్లాడుతూ మైనారిటీలపై మతోన్మాద బిజెపి చేస్తోన్న దాడులకు స్పష్టమైన ఆధారమే ఇటీవల విడుదలైన బిబిసి డాక్యుమెంటరీ అని అన్నారు. బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, రాందేవ్ బాబా వ్యాఖ్యలు మైనార్టీలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్లో మైనారిటీల కేటాయింపులో 33 శాతం కోత, స్కాలర్‌షిప్‌ల నిలిపివేత మైనార్టీలను ఆర్థికంగా, విద్యాపరంగా అణచివేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కూడా బిజెపి అజెండానే అమలు చేస్తోందని, గతం నుంచి ఉన్న సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. కేంద్రంలో మతోన్మాద బిజెపితో, రాష్ట్రంలో మైనార్టీలపట్ల వివక్షత చూపుతున్న వైసిపితో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆరుగురు సెక్రటేరియట్ సభ్యులతోపాటు, ముగ్గురు కోఆప్ట్ సభ్యులుగా షేక్ రషీద్ (నెల్లూరు), ఎస్.ముస్కీన్‌వలి (అనంతపూర్), పి.చాంద్‌బాషా (కడప)ను, 29 మంది రాష్ట్ర కమిటీ సభ్యులతోపాటు ఎం.షంషీర్ బేగ్, అబ్దుల్ సలీంలను కమిటీలోకి తీసుకున్నారు. రంజాన్ నెలలో మైనారిటీలకు సేవా, సహాయ కార్యక్రమాలు, మైనార్టీల స్థితిగతులపై సర్వే కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

పిఆర్‌సి బకాయిలను చెల్లించాలి

- బొప్పరాజు వెంకటేశ్వర్లు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : ప్రభుత్వ సలహాదారుడు చంద్రశేఖర్ రెడ్డి
- కర్నూలులో ముగిసిన ఎపి జెఎసి అమరావతి మహాసభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి బకాయిలను ఉద్యోగులకు చెల్లించాలని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు నగర శివారులోని జిఆర్‌సి ఫంక్షన్ హాల్లో ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర మూడవ మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ఉద్యోగులు జెఎసి కార్యవర్గ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్ర నూతన కార్యవవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. మహాసభలో బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పిఆర్‌సి బకాయిలను చెల్లించకపోతే ఆందోళన కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ముఖ ఆధారిత హాజరు రద్దు చేయాలని, కొన్ని శాఖల్లో పని చేసే ఉద్యోగులపై ఒత్తిళ్లు తగ్గించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఉద్యోగులకు డిఎ త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ఎపి జెఎసి అమరావతి చైర్మన్‌గా బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్‌గా పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్‌గా టివి ఫణిపేర్రాజు, కోశాధికారిగా వివి మురళి కృష్ణంనాయుడు, ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు.ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ కృష్ణమోహన్‌రావు, ప్రచార కార్యదర్శిగా బి కిశోర్ కుమార్, కో-చైర్మన్లు-వైస్ చైర్మన్లుగా, కార్యదర్శులూ ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలు జిల్లా జెఎసి చైర్మన్ గిరికుమార్ రెడ్డి, ఎపి పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్రయ అధ్యక్షులు ఓంకార్ యాదవ్ ఎపి మున్సిపల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు వెంకటరెడ్డి ఎపి 4వ తరగతి ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు మద్దిలేటి ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్రూవర్ దస్తగిరికి సిబిఐ నోటీసులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి సిబిఐ నోటీసులు జారీ చేసింది. కడప సెంట్రల్ జైలు కేంద్రంగా సిబిఐ ఎస్‌పి రాంసింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి అనుమానితులను విచారిస్తున్న సంగతి తెలిసిందే. శనివారం ఎ-1 నిందితునిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎర్రగంగిరెడ్డి సిబిఐ అధికారులను శనివారం కలిశారు. వివేకా మాజీ డ్రైవర్ దస్తగిరి ఆదివారం జైలుకు వచ్చి సిబిఐ అధికారుల నుంచి నోటీసులు తీసుకున్నారు. దస్తగిరితోపాటు జైలులో ఉంటున్న మిగిలిన ముగ్గురికీ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మీడియాతో దస్తగిరి మాట్లాడుతూ విచారణలో భాగంగానే సిబిఐ అధికారులు తనను పిలిచారన్నారు. ఈ నెల పదిన హైదరాబాద్‌లోని సిబిఐ కోర్టుకు హాజరు కావడంలో భాగంగానే కలిశానని తెలిపారు. ఎవరి నుంచైనా బెదిరింపులు, ఇతరత్రా భయాందోళన కలిగించే పరిస్థితులేమైనా ఉన్నాయా అని ఆరా తీశారన్నారు. త్వరలోనే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని, మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. వైఎస్ వివేకా హత్య కేసు తెలంగాణ కోర్టుకు మళ్లించడం మంచిదేనన్నారు. రాష్ట్రంలో ఈ కేసు విచారణ సజావుగా సాగడానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి సుముఖంగా ఉంటే పది రోజుల్లోనే తేలిపోయేదని, లేకపోవడం వల్లే తెలంగాణాకు తరలించారని ఆయన వ్యాఖ్యానించారు.



నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి (ఇన్‌సెట్‌లో స్వర్ణకుమారి)

తలశిల రఘురామ్‌కు సతీవియోగం

ప్రజాశక్తి-విజయవాడ రూరల్

వైసిపి శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం సతీమణి స్వర్ణకుమారి (44) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విజయవాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. స్వర్ణకుమారి మృతిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిఎం దంపతులు విజయవాడ గొల్లపూడిలోని తలసిల రఘురాం నివాసానికి వచ్చారు. రఘురాం భార్య స్వర్ణకుమారి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. స్వర్ణకుమారి భౌతికకాయాన్ని రాష్ట్ర మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కైలే అనిల్, సింహాద్రి రమేష్, బాలినేని, గొల్లపూడి ఎఎంసి మాజీ చైర్మన్ కొమ్మ కోట్లు, యర్కారెడ్డి నాగిరెడ్డి, కాటంనేని పూర్ణ, ఒంకర్ రెడ్డి, ఎంపిపి ప్రసన్నకుమారి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం గొల్లపూడిలోని స్మశాన వాటిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. స్వర్ణకుమారి మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

నూతన పరకామణి భవనంలో శ్రీవారి కానుకల లెక్కింపు ప్రారంభం

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల శ్రీవారి హుండీ కానుకలను నూతన పరకామణి భవనంలో ఆదివారం నుండి లెక్కించడం ప్రారంభించినట్లు టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ సహకారంతో నూతన పరకామణి భవనాన్ని అత్యాధునిక భద్రతతో ఏర్పాటు చేశామన్నారు. గతేడాది సెప్టెంబర్ 28న రాష్ట్ర సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించారని చెప్పారు. ఇకపై ప్రతిరోజు అన్ని హుండీలూ నూతన పరకామణి భవనానికి చేరుకుంటాయన్నారు. నెలరోజుల తరువాత ఆలయంలోని పరకామణి మండపాన్ని సందర్శకులు కూర్చునేందుకు అనువుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. లెక్కింపును పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఇఒ పరకామణి ఇంచార్జ్ రాజేంద్రకుమార్, ఇఇలు శ్రీహరి, జగన్మోహన్ రెడ్డి, డిఇ రవిశంకర్ రెడ్డి, విజిఒ బాల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై 10న నిరసన : కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 10న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఈ నిరసనలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం పదేపదే అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

కెజిబివి సిబ్బందితో వైసిపి ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం

- సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి నిర్వాకంపై టీచర్ల ఆగ్రహం



జెడ్‌పి సమావేశ మందిరం ఎదుట ఎపిసికి వ్యతిరేకంగా చర్చించుకుంటున్న కెజిబివి టీచర్లు, సిబ్బంది

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎపిసి).. కెజిబివి టీచర్లు, సిబ్బందితో ఆధివారం అధికారకంగా సమావేశం ఏర్పాటు చేశారు. వైసిపి బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం కోసం ఈ సమావేశం నిర్వహించారని తెలుకున్న టీచర్లు, సిబ్బంది అసహనంతో వెనుదిరిగారు. ఏర్పాటు చేసిన భోజనాలు చేసేందుకూ నిరాకరించారు. విజయనగరం జిల్లా పరిషత్తు వేదికగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసిపి తరపున బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సుధాకర్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఓటర్ల చేర్పుల విషయంలో అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఎన్నికల విభాగంతో సంబంధం లేకుండా అన్ని శాఖల అధికారులూ భాగస్వామ్యమయ్యారు. కార్యాలయ నిర్వహణ సమయంలోనే సిబ్బందితో ఆన్‌లైన్ పనులు చేయించారు. ఈసారి బరితెగించిన ఎపిసి స్వామినాయుడు.. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ, అధికారిక సమావేశం పేరిట జిల్లా పరిషత్తు సమావేశ మందిరానికి రావాలని కెజిబివిల సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 26 కెజిబివిల నుంచి టీచర్లు, సిబ్బంది హుటాహుటీన వచ్చారు. తీరా సమావేశంలో ఎపిసికి బదులు ఎమ్మెల్సీ అభ్యర్థి వేదికపై దర్శనమిచ్చారు. తనను గెలిపించాలంటూ వేడుకున్నారు. దీంతో టీచర్లు, సిబ్బంది బిత్తరపోయారు. సమావేశం పేరుతో ఎపిసి తమను మోసం చేశారంటూ అసహనం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు. ఎపిపి అక్రమ చర్యలతో ఇంతలా ఇబ్బంది పడుతుంటే, ఆయన బలపర్చే అభ్యర్థికి ఓట్లు వేస్తే ఇంకెన్ని ఇబ్బందులు పడాలో.. అంటూ చర్చించుకోవడం గమనార్హం.

రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నా : కోటంరెడ్డి

- గన్‌మెన్లను ప్రభుత్వానికి సరెండర్ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తన వద్ద ఉన్న ఇద్దరు గన్‌మెన్లు కూడా తనకు వద్దంటూ పంపించారు. కోటంరెడ్డి వద్ద ఉన్న 2 ప్లస్ 2 గన్‌మెన్లను ప్రభుత్వం 1 ప్లస్ 1కు కుదించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయంపై స్పందించేందుకు ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ.. తనకు వైసిపి విధానాలు నచ్చక బయటకు వచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి వైసిపి పెద్దలు తనను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వ్యక్తిగతంగా విమర్శిస్తూ రౌడీలతో బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ఇలాంటి సమయంలో భద్రతను పెంచాల్సిన ప్రభుత్వం కుదించడమేమిటని ప్రశ్నించారు. తనకు భద్రత అవసరంలేదని, మద్దతుదారులే రక్షణగా ఉంటారని తెలిపారు. తన వద్ద ఉన్న 1 ప్లస్ 1 గన్‌మెన్లను కూడా తిరిగి ప్రభుత్వానికి సరండర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు గన్‌మెన్లను తొలగించి ప్రభుత్వం తనకు ఓ గిఫ్టు ఇచ్చిందని.. తాను మిగిలిన ఇద్దరిని కూడా తొలగించి ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్టు ఇస్తున్నానని తెలిపారు. ఒంటరిగా తిరుగుతానని.. ఎవరు ఏం చేసుకుంటారో చేసుకోవచ్చని అన్నారు. తన సెక్యూరిటీని మీడియాకు పరిచయం చేయగా.. ఇద్దరు గన్‌మెన్లు భావోద్వేగానికి గురైయ్యారు. కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే వారిని ఓదార్చారు.



కోటంరెడ్డికి సంఘీభావం తెలుపుతున్న అమరావతి రైతులు

'కోటంరెడ్డి'కి అమరావతి రైతుల సంఘీభావం

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అమరావతి రైతులు సంఘీభావం ప్రకటించారు. అమరావతి నుంచి వచ్చిన రైతులు ఆదివారం సాయంత్రం కోటంరెడ్డిని కలిశారు. గతంలో న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్ర సమయంలో తమను పరామర్శించారని, తమ న్యాయమైన పోరాటానికి మద్దతు పలికిన కోటంరెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కోటంరెడ్డికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం

- 2024 ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం..
- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అఖిలప్రియదితనపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ చేసిన ఇన్‌సైడ్ ట్రేడింగ్, ఇతర ఆరోపణలపై ఎమ్మెల్యే శిల్పా నంద్యాలలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. సవాళ్లకు బెదరనని, 2024 ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని, తనపై పోటీకి ఎవరొస్తారో రండి అంటూ ఛాలెంజ్ విసిరారు. అఖిల ప్రియ తండ్రి భూమ నాగిరెడ్డి, ఎవి సుబ్బారెడ్డి అప్పట్లో ఆళ్లగడ్డ-కందుకూరు రోడ్డులో ఎకరం రూ20 వేలకు 200 ఎకరాలు కొనలేదా? ప్రస్తుతం కోట్లలో వాటి ధర లేదా? అని ప్రశ్నించారు. మా భూములకు విలువ వస్తే ఎందుకు అంత కడుపు మంట అని మండిపడ్డారు. జగత్ పాల డయిరీ స్థలం పీర్ల మాన్యం పేరు మీద ఉన్నది వాస్తవం కాదా?.. అని ప్రశ్నించారు. నంద్యాల చుట్టుపక్కల ఉన్న 18 గ్రామాలను ఇండస్ట్రియల్ ఎస్టేట్‌గా మారుస్తున్నామని అనడంలో వాస్తవం లేదన్నారు. అది కేవలం మ్యాపింగ్, మార్కింగ్ మాత్రమేనని తెలిపారు. రైతుల అభిప్రాయం, ఆమోదం లేకుండా ఎలాంటి భూములను తీసుకోరని చెప్పారు. చాబోలుకు చెందిన దళితుల ఏడెకరాలు భూమి కొన్నట్లు డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయన్నారు. మీ దగ్గర ఏ ఆధారాలు ఉన్నాయో చూపించాలని డిమాండ్ చేశారు. తన తండ్రి శిల్పా మోహన్ రెడ్డి ఎమ్మెల్యే కాకముందే రైతు నగరం ఏరియాలో 30 ఎకరాల భూములు కొన్నాడని తెలిపారు. ఎన్నికల సమయంలో బిజీగా ఉండడం వల్ల 2002-2003 మధ్యలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నీ సా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైసిపి నాయకులు అమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అక్షరం
చిగురిస్తే శబ్ధమౌతుంది..
తీగ సాగితే వాక్యమౌతుంది
పందిరంత విస్తరిస్తే గ్రంథమౌతుంది
సమస్త వాఙ్మయ సృష్టికి బీజరూపం అక్షరమే
- డా. సి.నారాయణరెడ్డి



ముఖచిత్రం

అతడు చిత్రం గీయటం మొదలెట్టాడు
వొక తెల్లని కాన్వాస్ పైన.

యుగయుగాల్నించీ రాజుకుంటోన్న రాజ్యాల్నీ,
రాజ్య సరిహద్దుల్నీ,
భీకర యుద్ధ సన్నివేశాల్నీ,
మృత్యులోయల్తో వున్న అమోఘమైన పర్వతాల్నీ,

యెరుపునీ, నౌకల్నీ, ద్వీపాల్నీ,
చిట్టి చేపల్ని మింగేసిన తిమింగాల్నీ,
చీకటికి, మృత్యువుకీ హామీనిచ్చే నక్షత్రాల్నీ,
నలుపు రంగు తోడేల్నీ,
యెరుపు రంగు సింహాల్నీ,
గుర్రాల్నీ, గుర్రపు డెక్కల్లాంటి గ్రంధాల్నీ,
అడవుల్నీ, మనుష్యుల్నీ,
మనుష్యులు తవ్వుకున్న లోయల్నీ, ఫకీరుల్నీ,
యింద్రధనుస్సులోని రంగుల్నీ,
యోధుల్నీ, సాధువుల్నీ,
పసి పాపల్నీ, నలుపులాంటి పాపాల్నీ,
అంతా అందంగా
చిత్రించేసి విశ్రమించాడు.

తను చనిపోయే కొద్ది క్షణాల ముందు,
తన చిత్రాన్ని చూసుకున్నాడు.

అస్తవ్యస్తమైన గీతలూ,
రంగుల్తో వున్న ఆ చిత్రం,
మనిషి ముఖాన్ని పోలి వుంది.

– శ్రీధర్ చందుపట్ల
949 3122 742



భూస్వరం

ఈ నేలా ఈ ఆకాశం
యుద్ధాలని ఓడించాయి
అశోకునికి అహింసను
బోధించాయి
దాష్టీకానికి
ఎదురుగా నిలబడే
గున్నమ్మల్లకు నిర్మలక్కలకు
జన్మనిచ్చినవి
నాగావళీ వంశధారల పరుగులతో
కరువును ఓడించినవి
ఆదివాసీ విల్లంబులతో
రాజ్యాన్నే నిలువరించిన
మహేంద్ర గిరులివి
తడ భూములను కొల్లగొట్ట వచ్చిన
ధర్మల్ రాకాసులను
వడిసెల రాయితో పారదోలినవి
నెత్తుటి త్యాగాలతో భూదేవి నుదుట
తిలకంగా మెరుస్తున్నవి

కళింగ సీమ ఇది
అమాయకంగా కనిపించే
ధిక్కార భూస్వరమిది!

– కెక్యూబ్
94934 36277

ఆ వెట్టి గొట్టెలకొక నివాళి


వాళ్ళంతా కలిసినట్లుంటూనే
కలవనివ్వని ఆధిపత్యమై
వాళ్ళంతా ఏకమవుతూ
చాపకింద నీరులా ప్రవహిస్తారు
వాళ్ళ పెదాలు మాత్రం
దేశభక్తిని రగుల్గొల్పుతాయి
ఆ దేశభక్తుల్లో
ఆ దేశం కోసం త్యాగం చేసిన వాళ్ళలో
వాళ్ళు మాత్రమే
జెండాలై రెపరెపలాడుతుంటారు
వాళ్ళు జాతీయతను
నరనరాల్లోనూ ప్రసంగాలతో
మత్తుపూతలు పూస్తూ
నొప్పి తెలియకుండా ఎక్కిస్తారు
వశీకరణకు గురైన జంతువుల్లా
తమనే బలితీసుకోబుతున్న వాళ్ళతోనే
ఒక ఉన్మాదంతో
వాళ్ళు పన్నిన వలలన్నీ విసురుతూ
గ్రూపులు గ్రూపులుగా ఫార్వార్డవుతుంటారు
విషాదమేమిటంటే
రేపు పార్లమెంటులో బహిరంగంగా
నిన్నూ, నీ అస్తిత్వాన్నీ సమాధి చేయబోతున్నాడని
చెప్పినా విననంతగా
ఈ గొట్టెలన్నీ వశమై'పోతాయి'

ఏ గ్రూపులోనైనా నాకు
ఆ వెట్టి మొహాలు తగిలించుకొని
వల్లించే చిలుకపలుకుల్ని వింటున్నప్పుడు
దేవుడా!
ఆ ముసుగు తొలగించగలిగే శక్తిని
నాకు ప్రసాదించమని అడగాలనిపిస్తుంది!

ఒంటరిగానే ఉంటూ
తనవెంటెవరో ఉన్నారనుకునే
స్వీయ సాంస్కృతిక విధ్వంసంతో ఎదురయ్యే
ఆ గొట్టెల్ని చదువుతున్నప్పుడల్లా
దేవా! వీళ్ళేమిచేస్తున్నారో వీళ్ళకు తెలియదు
వీళ్ళ అమాయకత్వాన్ని క్షమించి
వీళ్ళకు కాస్తంత వెర్రిని బదులు
కాస్తంత వివేకాన్నివ్వమని అడగాలనిపిస్తుంది!

– దార్ల వెంకటేశ్వరరావు
91826 85231

స్ఫూర్తిదాయక స్వీయ చరిత్ర



సమీక్ష

పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలకు చదువుల దీపం అక్కరలేదన్నారు. అలాంటి సమయంలో కందుకూరి, గురజాడ, చలం వంటి వారు స్త్రీలు కూడా మనుషులేనని వారి పక్షాన నిలిచి పోరాడారు. వారి జీవితాల్లో అక్షరాల లాంతర్లు వెలిగించారు. 60 వ దశకం నుంచి స్త్రీలు కథలు, నవలలు విరివిగా రాసి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఒకానొక సమయంలో పురుష రచయితలు కూడా తమ రచనలను ఆడ పేర్లతో పత్రికలకు పంపించారంటే వారి ప్రభావం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. 80ల నుంచి స్త్రీలు కవిత్వం రాయడం మొదలు పెట్టారు. 'పురుషాహంకార సమాజాన్ని ధిక్కరిస్తూ తమ బాధలను, సమస్యలను వ్యక్తీకరించారు. అప్పటి వరకు పురుషుల పంజరాల్లో బంధింపబడిన కవిత్వం చిలుక బంధనాలు తెంచుకొని స్త్రీల చేతుల్లో వచ్చి వాలింది.

వచనంలోనూ, కవిత్వంలోనూ స్త్రీలు పురుషులకు తీసిపోకుండా రచనలు చేశారు. ఆత్మకథా ప్రక్రియలో మాత్రం స్త్రీల సంఖ్య తక్కువే. పంజాబీ కవయిత్రి అమృతా ప్రీతమ్ 'రెవెన్యూ స్టాంప్', అజీత్ కౌర్ 'విరామమెరుగని పయనం', బేబీకాంబ్లే 'ప్రిజన్స్ వి బ్రోక్', పి.శివ కామి 'ది గ్రిప్ ఆఫ్ చేంజ్' జిలాని బాను 'మై కౌన్ హు', నళిని 'ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ', రేవతి 'ఒక హిజ్రా ఆత్మకథ' మరాఠీ దళిత స్త్రీ బేబీకొండిబా కాంబ్లే రాసిన 'జినా అచ్చా అవర్ లైవ్స్' ప్రసిద్ధమైన ఆత్మ కథలు.

తెలుగులో కొండపల్లి కోటేశ్వరమ్మ 'నిర్జన వారధి', ముదిగొండ సుజాతారెడ్డి 'ముసురు', భానుమతి 'నాలో నేను', సరస్వతి గోరా 'గోరాతో నా జీవితం', సంగె లక్ష్మి భాయి 'నా జైలు జీవితం', షాజహానా 'మేరా జహా' ముఖ్యమైన ఆత్మ కథలు. కె. వరలక్ష్మి 'నా జీవన యానం', శీలా సుభద్రాదేవి 'నడక దారిలో' ప్రస్తుతం ధారావాహికంగా పత్రికల్లో వస్తున్న స్వీయ చరిత్రలు. ఈ కోవలోకి చెందినదే డా.అమృతలత గారి 'నా ఏకాంత బృందగానం'

కథలు, కవితలు వంటి సృజనాత్మక రచనలు చేయడం వేరు. ఆత్మకథలు రాయటం వేరు .ఆత్మ కథ రచయితకు తన జీవితంలో జరిగిన యథార్థ సంఘటనలను నిజాయితీగా నిర్భయంగా చెప్పే ధైర్యం ఉండాలి. పుట్టుక, పెళ్ళి, ఉద్యోగం తేదీల సమాహారం కాదు ఆత్మ కథ అంటే. గాంధీ ఆత్మ కథ చదివితే ఆనాటి భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను చదివినట్లే. శ్రీశ్రీ 'అనంతం' చదివితే ఆనాటి ప్రపంచ ప్రఖ్యాత కవులు, వారి కవితా ధోరణుల గురించి తెలుసుకున్నట్లే .

ఎక్కడో నిజామాబాద్ జిల్లాలో 'పడకల్' అనే మారుమూల గ్రామంలో పుట్టిన ఒక ఆడపిల్ల స్వయంకృషితో తాననుకున్న లక్ష్యాలను సాధించి ఒక వటవృక్షమై పెరిగి ఎందరికో నీడనిచ్చిన వాస్తవ చరిత్ర ఈ స్వీయ చరిత్ర.

70 ఏళ్ళ కిందట ఒక ఆడపిల్ల చదువుకోవాలంటే ఎన్ని కష్టాలు పడాలో ఎన్ని అవరోధాలు అధిగమించాలో తెలియచెప్పిన గ్రంథం 'నా ఏకాంత బృందగానం'. చిన్నప్పుడే కన్న తల్లి మరణించడం, ఆ తర్వాత కన్నతండ్రి మరణించడం, చదువుకోవాలనే తపనతో అక్కయ్యల ఊళ్లు, అన్నయ్యల ఊళ్ళకు వెళ్లి మైళ్ళకు మైళ్ళు నడిచి బడికి వెళ్ళి చదువుకోవడం ఆమె జీవితంలో కష్టమైన కాలం. అమృత లత గారికి 15 ఏళ్ళకే బాల్య వివాహం జరగడం, చదువుకోసం పోరాడి చివరకు ఉన్నత విద్యాశిఖరాలు అందుకోవడం, 65 ఏళ్ళ వయసులో పిహెచ్‌డి చేయడం ఆవిడ పట్టుదలకు తార్కాణం. వివాహ విషసర్పం కాటువేయాలని చూసినా తెలివితో దానిని తప్పించుకొన్నారు. సమయోచిత నిర్ణయాలు తీసుకొని జీవితంలో ముందుకు సాగిపోయారు. .ఆమె చిన్నప్పుడు ఆటలాడుతూ చేతి వేళ్ళు పోగొట్టుకొన్నారు. బంధువులు అందరూ వేళ్ళు లేని అమ్మాయికి పెళ్ళి ఎలా అవుతుందని ఎగతాళి చేసినా ఆ మాటలు పట్టించుకోకుండా ఏకాగ్రతతో నిలచి తన లక్ష్యాన్ని సాధించారు. జీవితంలో ఎవరూ ఊహించని ఉన్నత శిఖరాలు అధిరోహించారు.

చదువు, సాహిత్యం ఆమెకు రెండు కళ్ళు. స్కూల్లో చదువుతున్నపుడే కథలు రాశారు. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి వంటి పత్రికల్లో ఆమె కథలు, సీరియల్ నవలలు ప్రచురితమయ్యాయి. 'అమృత్ కిరణ్' అనే పత్రికను కొన్నేళ్ళపాటు నడిపారు.

కాలేజీలో చదువుతున్నపుడు ఇంగ్లీషులో పాఠాలు చెప్తుంటే అర్థంకాక అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్య అందించాలని విజయ విద్యాసంస్థలు నెలకొల్పారు. కేవలం పాఠాలు చెప్పటం ఒక్కటే కాదని, విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులను మేల్కొల్పాలని ఏటా వార్షికోత్సవాలు. నిర్వహించారు. నాటికలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. లా కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీలు స్థాపించారు. ప్రభుత్వోద్యోగాన్ని వదులుకొని విద్యాసంస్థలను నిర్వహించారు. ప్రతిష్టాత్మకమైన అపురూప అవార్డులను స్థాపించి సాంస్కృతిక సాహిత్య కళా రంగాల్లో కృషి చేసిన వారికి 2011 నుంచి ఏటా ఇస్తున్నారు. ఒక సంస్థ చేయాల్సిన పనిని ఒక వ్యక్తి చేస్తున్నారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారికి అవార్డు ఇచ్చి సన్మానం చేయడమే కాకుండా వారిని గురించిన వివరాలతో అభినందన సంచికలు తెస్తున్నారు. ఏది చేసినా సమగ్రంగా సాధికారంగా చేయడం ఆమె ప్రత్యేకత.

ఒకటేరకం దినచర్యల జీవితాల్లో నుంచి కొంచెం మార్పుగా ఏ అందమైన ప్రదేశాల్లోనో పర్యటించినప్పుడు అపరిమితానందం కలుగుతుంది. ఈ విషయం బాగా తెలిసిన అమృతలత తన స్నేహితులతో, బంధువులతో కలిసి దేశ విదేశాల్లో చేసిన పర్యటన విశేషాలు ఈ పుస్తకంలో వివరించారు. కష్టాలు వచ్చినప్పుడు పోరాడి గెలవడమే కాదు; జీవితానికి ఆనంద ఆస్వాదనలనూ అందించాలనన్న పాఠాలు కళ్ల ముందు కదులుతాయి.

జీవితంలో పుట్టుక, చావు ఎంత ప్రధానమైనవో పెళ్ళి కూడా అంత ప్రముఖమైనదే స్త్రీలకైనా, పురుషులకైనా. స్త్రీపురుషులిద్దరూ 'సమానమే అయినా వరకట్నం, కన్యా శుల్కం దురాచారాల చిక్కుముళ్ళలో చిక్కుకున్న స్త్రీలే ఎక్కువ మంది కనిపిస్తారు మనకి. ఆ విషాదాన్ని తట్టుకోలేక దిగులు బావుల్లో కూరుకుపోతారు. అటువంటి క్లిష్ట సమయాల్లోనూ అమృతలత ధైర్యంగా నిలబడ్డారు. ఆ వివాహ బంధం నుంచి బయటపడి తన బతుకు చక్రాలను ముందుకు నడిపించారు.

ఒక విద్యావేత్తగా, ఒక సాహితీవేత్తగా విద్యాసంస్థల నిర్వహణాధికారిగా, పాలనాదక్షురాలిగా, సంపాదకురాలిగా, రచయిత్రిగా అమృత లత బహుముఖ ప్రజ్ఞావంతురాలు. అపురూపమైన స్నేహ బాంధవి. ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నా తన జీవితంలో తనకు అండదండగా తోడు నిలిచిన బంధువులను మరిచిపోలేదు. అందర్నీ పేరు పేరునా తలుచుకొని వారికి ధన్యవాదములు చెప్పారు. నిండుగా కాచిన చెట్లు ఒంగినట్లు ఆమె ఎన్నో విజయాలు సాధించిన వినయమూర్తి.

ఇంట్లో తల్లి కొట్టినా, బళ్ళో మాష్టారు తిట్టినా ఆత్మహత్యలు చేసుకునే నేటి విద్యార్థులు ముఖ్యంగా ఆడ పిల్లలు తప్పక చదవగలిగిన స్వీయ చరిత్ర. ఎన్ని కష్టాలు వచ్చినా కుంగిపోకుండా ధైర్యంగా నిలవటం; ఎన్ని సంపదలున్నా కొంచెం కూడా అహంకారం లేకపోవటం, చదువంటే విపరీతమైన ఆసక్తి, జీవన సంగ్రామంలో పోరాడి గెలవడం, ఒక విద్యావేత్తగా, సాహిత్య వేత్తగా, ప్రసిద్ధి చెందడం .. వంటి అంశాలతో ఆదర్శప్రాయంగా నిలుస్తారు అమృతలత. ఈ స్వీయచరిత్రలో ఆనాటి ఆచారాలు, ఆటలు, పండగలు అన్నిటినీ కళ్ళకు కట్టేటట్లు వర్ణించారు. అప్పుడు ఏమి కొనాలన్నా ఇంట్లో వున్న ధాన్యం ఇచ్చి కొనే వస్తు వినిమయ పద్ధతిని, తెలంగాణా సంప్రదాయపు వంటలు పండగలు అన్నిటినీ పరిచయం చేశారు. తన సమకాలీన జీవితంలో దేశానికి, రాష్ట్రానికి ఎవరెవరు ప్రధానమంత్రులుగా, ముఖ్యమంత్రులుగా వున్నారో వారి ఫోటోలను ప్రచురించడం బాగుంది. జీవితంలోని ముఖ్యమైన సంఘటనల గురించిన ఫోటోలతో సహా అత్యంత ఆసక్తికరంగా వివరించారు. సరళమైన శైలితో ఈ పుస్తకం అందరినీ ఏకబిగిన చదివిస్తుంది. ప్రతికూల పరిస్థితులతో పోరాడుతూ, కాళ్ళకింద గుచ్చుకొన్న సంప్రదాయపు ముళ్ళను ఏరిపారేస్తూ, అపజయాల అవహేళన రాళ్ళను విసిరి పారేస్తూ తాను అనుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తూ, మొక్కవోని దీక్షతో విజయ శిఖరం అందుకొన్న వ్యక్తి ఆత్మకథ ఇది. అక్షరాలనే ఆయుధాలుగా చేసుకొని పోరాడిన ఒక అపురూప గాథ ఇది. ఇది అమృత లత ఒక్కరి కథ కాదు; స్వాభిమానం గల మహిళలందరి బందగానం.

– మందరపు హైమవతి
94410 62732

మంచిని మేల్కొల్పే 'మృత్యుపత్రం'



సమాజంలోని అవినీతి, దురన్యాయాలు, దుష్ట సంప్రదాయాలను ఎండగడుతూ, మంచికి మానవత్వానికి పట్టం కడుతూ సమాజానికి మానసిక వైద్యం చేసేది రంగస్థలం. జీవితపు విలువలను ఎత్తిచూపుతూ, ఎత్తుపల్లాలను సరిచేస్తూ, పతనం వైపు పరుగులు తీసే మనిషి ఆలోచనలకు పగ్గం వేసేది– ప్రయోజనాత్మక నాటకం.

గత సంవత్సరం అక్టోబర్ నుంచి అనేక పరిషత్తుల్లో పోటీపడుతూ బహుమతులు గెల్చుకుంటూ వ్యవస్థలోని అవినీతిని ఎండగడుతూ, ప్రదర్శింపబడుతున్న నాటిక 'మృత్యు పత్రం'. ఇది మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారి ప్రదర్శన. రచన దర్శకత్వం మద్దుకూరి రవీంద్రబాబు. ఇప్పటికే ఈ సమాజం వారు 'మంచం మీద పెళ్లి' అనే హాస్యనాటికతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

డబ్బు, డబ్బును హెచ్చిస్తుంది కానీ చచ్చిన మనిషిని బతికించలేదు. మనిషి బతకడానికి మాత్రమే డబ్బు ఉపకరిస్తుంది. చదువుకున్న మనుషుల్లో సైతం స్వార్థం పెచ్చరిల్లి మోయలేనంత డబ్బు సంపాదనలో పడి, తమ చదువుల్ని ఉద్యోగాల్ని తాకట్టుపెట్టి, బతికున్న శవాలుగా జీవిస్తున్న వాళ్లను గురించిన నాటిక ఇది. విద్యా వైద్య న్యాయ పోలీసు పాలన వ్యవస్థల్లో ప్రజలకు సేవలందించాల్సిన అత్యవసర సేవా విభాగాలతో పాటు, అవసరమైన వారికి అవసరమైన ఆధికారిక పత్రాలను జారీ చేయడానికి– ముందు వెనుకలు మంచి చెడ్డలు ఆలోచించక, లంచాలకు మంచాలు వేస్తూ తమ పబ్బం గడుపుకునే డబ్బు గడ్డి తినే మనుషులు అన్ని రంగాల్లో మనకు కనిపిస్తారు. అలాంటి ఒక సందర్భాన్ని ఎంచుకొని ఆసక్తిదాయకమైన సన్నివేశాలు కల్పించి, గుండెను తాకే సంభాషణలు రచించి కళాత్మకంగా, రంగస్థలం ప్రయోజనాన్ని కళ్ళ ముందుకు తెచ్చిన నాటిక మృత్యుపత్రం.

తన కడుపులోని గడ్డను తీయించుకోవడానికి తన జీవనాధారమైన ఒక పశువును అమ్ముకుని ఆ డబ్బుతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న ఒక మాతృమూర్తికి, కళ్ళెదుటే జరిగిన రోడ్డు ప్రమాదం వల్ల కొన ఊపిరితో ఉండి, నా అన్నవాళ్లు దరిలేని స్థితిలో ఒడిలో చేర్చుకున్న ఆ బిడ్డను, అది ఆమె కొడుకే అని భావించి, పోలీసు, ఆసుపత్రికి తీసుకువస్తుండగా మరణించిన బాలుడికి పోస్టుమార్టం నిర్వహించి డెత్ సర్టిఫికెట్ ఇవ్వటం వరకు జరిగే తంతును కథాంశంగా తీసుకొన్నాడు రచయిత. వ్యక్తులలో ధన దాహం, దోపిడీ, లంచగొండితనం, అవినీతి స్వభావం పెరిగిపోయి, మానవత్వం అన్నది కలికానికి కూడా కనిపించని స్థితిలో ప్రధాన పాత్రధారి నారాయణ అనే ఆటో డ్రైవర్‌కు షాక్ ఇచ్చే నిజం బయటపడడంతో అతడిలోని మనిషి/ తండ్రి బావురుమంటాడు. శవానికి కాపలా కాయడం, ఎలుకలు కొరికి తినకుండా చూడటానికి, సత్వరమే పోస్టుమార్టం నిర్వహించే లాగా చేయడానికి, కానిస్టేబుల్, కాంపౌండర్, డాక్టర్లలో అవినీతి విశ్వరూపం బయటపడుతుంది. మనిషికి అయితే 300, శవానికైతే 3000 అంటే, శాంతమ్మ అనే ఆ అమాయక పల్లె స్త్రీమూర్తి,తన శస్త్ర చికిత్స కోసం తెచ్చుకున్న మొత్తం అంతా హారతి కర్పూరంలా కరిగిపోగా, చేతి గాజులు కూడా ఇచ్చి కావలసిన కార్యం జరిపించమంటుంది. కత్తులతో పసిబిడ్డ శవాన్ని కోస్తారని తెలిసి, పోస్టుమార్టం జరిపించకుండానే, మృత్యుపత్రం ఇప్పిస్తే.. తన పల్లెకు తీసుకుపోయి అంత్యక్రియలు జరిపించాలి అనుకుంటుంది.

ఎట్టకేలకు చేతికొచ్చిన ఆ మృత్యుపత్రంలో ఏం రాసి ఉందో కాస్త చదివి చెప్పమంటుంది శాంతమ్మ. గుర్తు తెలియని వాహన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన బిడ్డ పేరు శ్రీరామ్ అనీ, ఊరు అడివిపాలెం అని.. బోయపాలెం జంక్షన్ వద్ద జరిగిన ఆ ప్రమాద వివరాలు రాసిన ప్రమాణం పత్రాన్ని చదువుతాడు కానిస్టేబుల్. పేరు నీకెలా తెలుసు? అని అడుగుతుంది ఆమె. పోలీస్ కానిస్టేబుల్ – చేతి మీద పచ్చబొట్టు ఉందిగా అంటాడు. ఆ మాటలు వింటున్న ఆటో డ్రైవర్ నారాయణ మీద పిడుగు పడ్డట్లే అవుతుంది. పేరు మళ్లీ చెప్పమంటాడు. అప్పటివరకు జరిగిన అవినీతి తంతులో.. బిడ్డ ఎవరో కూడా తెలియని శాంతమ్మలోని తల్లి తన రొంపిన ఉన్న డబ్బు మూట, చేతి గాజులు ఖర్చు చేసిన వైనం తెలిసి, అప్పటివరకూ,తాను ఆడిన నాటకం, తన వికృత వైఖరి గుర్తుకొచ్చి గుండెలు బాదుకొంటాడు. అప్పుడు శాంతమ్మ అడుగుతుంది.. "ఆ సావుకాగితం ఎవరిది బాబు? చచ్చిపోయిన పసిబిడ్డదా? శవాలమీద డబ్బు సంపాదించుకోవాలని చూస్తున్న ఈ మనుషులదా?" అని. "మీరంతా చదువుకున్న పెద్దోళ్ళు గొప్పోళ్ళు. మీ ఉద్యోగాల్ని బతుకుల్ని మీ మనసుల్ని ఇలాంటి సావు కాగితాలకు తాకట్టు పెట్టి బతుకున్న శవాలుగా మారకండి బాబు!" అంటూ ఆ మత్యు పత్రాన్ని చేతుల్లోంచి జారవిడుస్తుంది. ఆ దృశ్యాన్ని చూసిన ప్రేక్షకుల హృదయాలు కరుణ రసార్ధ్రమౌవుతాయి. కళ్ళు అశ్రుజల పూరితాలు అవుతాయి. గుండెలు బరువెక్కుతాయి. జరిగిన అవినీతికి అసహనంతో కూడిన ఒక మేలుకొలుపు రక్త ప్రసరణలో వేగం తెచ్చి వేడిని పుట్టిస్తుంది. చర్నాకోలుతో శరీరాన్ని తాకిన సలపరం కలిగి బరువైన నిట్టూర్పు వెలబడుతుంది. ఒక జీవిత సారాంశం ఏదో చెప్పలేని వైరాగ్య వేదాంత మనస్థితిని కలిగిస్తుంది.

అవినీతి జలగలు, మనిషి ఒంట్లోని రక్తాన్ని పీల్చేసినప్పటి భావన కలుగుతుంది. 'జింక పరిగెత్తడం నేర్చుకోకపోతే పులికి ఆహారమవుతుంది.. పులి పరిగెత్తడం నేర్చుకోకపోతే ఆహారం కరువవుతుంది.' 'అద్దాలమేడలో ఉన్నవాళ్లు అబద్ధం చెప్పినా నమ్ముతుందీ లోకం. పూరిగుడిసెలో ఉన్నవాడు పచ్చి నిజం చెప్పినా అబద్ధమే అంటుంది అదే లోకం.' ఇటువంటి సంభాషణలు ప్రేక్షకులను ఆలోచింపచేస్తాయి. ఒక అవినీతికి అద్దం పట్టి ప్రేక్షక లోకానికి ఇచ్చిన విజ్ఞాపన పత్రం– ఈ మృత్యు పత్రం.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

కాలంతో కరచాలనం అడిగోపుల కవిత్వం



"పదాలకెన్ని అర్థాలు/ అర్థానికెన్ని శబ్దాలు
వాక్యానికెన్ని దారులు
పండితుణ్ణి పామరుణ్ణి / అలరించిన కవిత్వం
పదునైన ఖడ్గమై / దుష్టశక్తుల్ని దునుమాడుతుంది
మానవత్వం సుక్షేత్రంలో / దిగుబడులు
తియ్యమంటుంది' – నాలుగు దశాబ్దాలుగా దారి తప్పని కలం రాసిన కవిత్వం ఇది. పదాలకెన్ని అర్థాలున్నా, వాక్యానికెన్ని దారులున్నా, అడిగోపుల వెంకటరత్నానిది అలుపెరగని అభ్యుదయ మార్గం. మజిలీలు లేని పురోగమన పథం. కొంతమంది రాసినదానితో తృప్తి పడతారు. ఇంకొంతమంది వచ్చిన పేరుతో మురిసిపోతారు. మరికొంతమంది రాయాల్సిందెంతో వున్నా రాయరు. నిత్య చైతన్యాత్మకమైన అడిగోపుల కలం, నిర్భయ గళం "ముందడుగు' వేస్తూనే వుంది. కొత్త 'సూర్యోదయాల్ని' ఆవిష్కరిస్తూనే వుంది. 'జయభేరి' మోగిస్తూనే వుంది. వైయక్తికత నుంచి సామాజికత వైపు పయనిస్తూనే వుంది. కాలానుగుణంగా 'కొత్తగాలి'ని కవిత్వంలో ప్రసరిస్తూనే వుంది . కొత్త ఉదయాల కోసం నిరీక్షిస్తూనే వుంది.

అడిగోపుల వెంకటరత్నమ్ నిరంతరకవి. వర్తమానంలోంచి భవిష్యత్తు వైపు పయనించే కవి. ఇన్నేళ్ళ స్వాతంత్ర్యాన్ని, అది ప్రసాదించిన దారిద్ర్యాన్ని, అందుకు కారణమైన దగుల్బాజీ రాజకీయాన్ని సజీవంగా చిత్రించే కవిత్వం అడిగోపులది. సమాజంలోని దు:ఖాశ్రువులకు భాష్యం అడిగోపుల కవిత్వం.

"నా నరకం నాది కాదు/ ఎదుటివాడి అర్పణం
వాడి స్వర్గం వాడిది కాదు/ నా స్వార్జితం' – శ్రమదోపిడీని ఇంత సంక్షిప్తంగా, సరళంగా చెప్పిన ఆధునిక కవి అడిగోపుల మినహా మరొకరు లేరు. కవిత్వం పేరుతో అస్పష్టతను, అర్థం కాని ప్రతీకలను పాఠకులపై రుద్దే కవులున్న కాలంలో అడిగోపుల స్వీయ శైలిని నిర్మించుకున్నాడు. ఆయన కవిత్వంలో రాజకీయం వుంటుంది. కాని ఆయనది రాజకీయ కవిత్వం కాదు. సామాజిక స్పర్శ, సాహిత్యపు పరిమళం సమతూకంగా సాగుతాయి. అడిగోపుల కవితల్లో పలుకుబడి ఏ పలుకుబడికీ లొంగదు.

'ఋతువులు పుష్పిస్తుంటాయి/ సంవత్సరాల్ని కాస్తుంటాయి'
'మనిషి పుట్టుకతోనే/ మతం ఒక అవయవమైంది'
'అస్తమయాన్ని ఉదయం / ఉదయాన్ని అస్తమయం వెంటబడుతూ
మారుతున్న యుగంలో/ మారని గమనం'
'కర్షకుడు ప్రజల హర్షకుడు' – ఇలాంటి పదునైన వాక్యాలు అడిగోపుల కలం నుంచి అలవోకగా వస్తాయి.

వర్తమాన కవుల్లో వస్తు దారిద్ర్యం స్పష్టంగా కనిపిస్తుంది. నిత్యం కనిపించే సమాజంలో కనిపించని అగాధాలను, ఆవేదన మూలాలను తవ్వి కన్నీటి చెలమల్ని బయటకు తీస్తాడు అడిగోపుల. 'కుటుంబ భారం మోస్తున్న/ బాల్యం బాధ చూసి/ కలత చెందిన పొలం / రాలిన పరిగను ఏరుకోమంటుంది' – ఈ పదాలు చదివాక అప్రయత్నంగా నా కళ్ళు చెమర్చాయి. 'అశ్రువీధిలో అగ్నిగానం' విన్న అడిగోపుల 'రాతి చిగుళ్ళ'లో మానవతా రాగాన్ని వెతికితీశాడు. 'మరణానికి రెండు ముఖాలు'ంటాయని ప్రప్రథమంగా గుర్తించింది ఆయనే! 'కాలం నా చేతిలో వుంద'ని కలంతో నిరూపించాడు.

అడిగోపుల వస్తు దృష్టి, భావ సృష్టి విలక్షణమైంది. ఏది చెప్పినా దాపరికం లేని భాషలో రాస్తాడు. రైతు మనసు తూకం చూస్తుంది/ త్రాసు కన్నీటిలో స్నానం చేస్తుంది'– అంటూ రైతు కన్నీళ్ళను పరిచయం చేస్తూ జాతీయ జెండాలో ఆకుపచ్చని రంగును భూమికి పూసే రైతులో అడిగోపుల పరకాయ ప్రవేశం చేస్తాడు. 'తెనుగు లెంక' తుమ్మల, 'కవికోకిల' దువ్వూరి, 'కవిబ్రహ్మ' ఏటుకూరి వంటి కవుల కర్షక కవిత్వాన్ని విత్తులో వృక్షం ఉన్నట్లుగానే, అడిగోపుల కవిత్వంలో విప్లవముంది. అది ఆయన పరిణితికి ప్రమాణం. 'నా గదే నాకు విశ్వవిద్యాలయం' – అన్న అడిగోపుల 27 కవితా సంపుటాల్లో 1500 పైగా కవితలకు పురుడు పోశాడు. కుందుర్తి కలగన్న వచన కవితా వికాసం అడిగోపుల కలంలో ఊపిరి పోసుకుంది. వస్తు వైవిధ్యం, ఎత్తుగడ, నిర్మాణం, ముగింపు, వ్యంగ్యాత్మకమైన శీర్షికలు అడిగోపుల వారిని విలక్షణ కవిగా నిలిపాయి.

'యుగాలు తిరగేస్తున్నాను/ చరిత్ర తవ్వి తీస్తున్నాను/ బాణాలు ఇప్పటికీ గుచ్చుకుంటున్నాయి/ ఎత్తుగడలు యీ నాటికీ జీవిస్తున్నాయి'. మనిషి స్వార్థంతో జీవించే ఎత్తుగడలు కవి భావుకతకు ప్రతీకలైన ఎత్తుగడలు అడిగోపుల కవిత్వంలో పోటీ పడతాయి. అంతు చిక్కని మార్మికత, అర్థం కాని తాత్వికత వారి మాటల్లో మచ్చుకైనా వుండవు. ఎన్ని ఇబ్బందులెదురైనా, సమస్యలు చుట్టుముట్టినా, అధికారం అణచి వేసినా కర్తవ్య నిర్వహణలో, నవ సమాజ నిర్మాణంలో మానవుడే కట్ట కడపటి విజేత అని నిర్ద్వంద్వంగా ప్రకటించి, జయకేతనం ఎగరేస్తాడు. ఎప్పటికైనా నా వేళ్ళు చూపుడు వేళ్ళవుతాయని సమాజపక్షంలో ఫలభరితం అవుతుందన్న ఆశను, ఆకాంక్షను ప్రకటిస్తాడు.

అభ్యుదయ కవిత్వానంతరం వచ్చిన కవిత్వోద్యమాలన్నీ అడిగోపుల కవిత్వంలో ప్రతిఫలించాయి. ఇజాలకతీతమైన నిజాల్ని చెప్పిన కవి అడిగోపుల. సాహిత్య స్పృహతో నిరంతరం సాగుతున్న నిలువెత్తు సామాజిక కవి. వేదికలకు, వివాదాలకు దూరంగా వుండే నిరాడంబర కవి. నిజాయితీ వారి చిరునామా! కవిత్వం వారి వీలునామా! కవిత్వంతో కరచాలనం చేస్తూ కాలాన్ని వ్యాఖ్యానించే దారి తప్పని అడిగోపుల కలానికి కవిత్వాభినందనలు.

– డా॥ బీరం సుందరరావు
63034 43302

బాబా రాందేవ్‌పై కేసు

జైపూర్ : ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగించిన యోగా గురు బాబా రాందేవ్‌పై కేసు నమోదయింది. రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాలోని చౌహతన్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక నివాసి పతే ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ నెల 2న ఇక్కడ జరిగిన ఒక సభలో ముస్లింలు, క్రిస్టియన్లు మతమార్పిడులు చేస్తారని, ఉగ్రవాద కార్యక్రమాలకు పాల్పడతారని, కిడ్నాపులు చేస్తారని రాందేవ్ విద్వేష ప్రసంగం చేశారు.

ఓటర్ల సంఖ్య 94.50 కోట్లు

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం, జనవరి 1నాటికి దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య 94 కోట్లా 50 లక్షల 25 వేల 694కు చేరుకుంది. దేశ స్వాతంత్ర్యం తర్వాత 1951 నాటి ఓటర్లతో పోల్చితే ఓటర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగింది. మొదటి సార్వత్రిక ఎన్నికలనాటికి దేశంలో 17.32 కోట్ల మంది ఓటర్లున్నారు. ఇందులో ఆనాడు 45.67శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలనాటికి ఓటర్ల సంఖ్య 91.20 కోట్లకు చేరుకుంది. ఓటింగ్ శాతం 67శాతం నమోదైంది. దాదాపు 30కోట్ల మందికిపైగా ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల సమయానికి ఓటర్ల సంఖ్య 83.40 కోట్లకు చేరుకుంది. ఇందులో 66.44శాతం మంది ఓటేశారు. ఈ ఏడాది రాజస్థాన్, కర్నాటక, మధ్యప్రదేశ్ సహా కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి.



ఆందోళన చేస్తున్న మహిళలు (ఫైల్)

గ్యాంగ్ రేప్ కేసులో అండమాన్ మాజీ ప్రధాన కార్యదర్శిపై ఛార్జిషీట్

పోర్ట్‌బ్లెయిర్ : గ్యాంగ్ రేప్ కేసులో అండమాన్ నికోబార్ మాజీ ప్రధాన కార్యదర్శి జితేంద్ర నారైన్‌తోపాటు మరో ముగ్గురిపై ప్రత్యేక దర్యాప్తు బృందం 935 పేజీల చార్జిషీట్ దాఖలు చేసింది.



గ్యాంగ్‌రేప్ కేసు దర్యాప్తు కోసం మాజీ ఐపిఎస్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు బృందాన్ని అండమాన్ నికోబార్ పోలీసులు ఏర్పాటు చేశారు. 90 మంది సాక్షులు, వివిధ ఎలక్ట్రానిక్, టెక్నికల్, బయోలాజికల్ ఆధారాల ద్వారా ఈ చార్జిషీట్‌ను రూపొందించినట్లు పోలీసులు తెలిపారు. గత ఏడాది ఏప్రిల్, మేలలో అప్పటి ప్రధాన కార్యదర్శి నివాసంలో తనపై రెండుసార్లు సామూహిక అత్యాచారం జరిగిందని ఒక మహిళ చేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. హైకోర్టు ఆదేశాలతో గత ఏడాది అక్టోబర్ 10న ఈ కేసును నమోదుచేశారు. గత నవంబర్ 15న జితేంద్రను పోలీసులు అరెస్టు చేశారు.

విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ పెంపు

న్యూఢిల్లీ : దేశీయంగా ఉత్పత్తి చేసే ముడిచమురుపై విధించే విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. డీజిల్, విమాన ఇంధనం (ఎటిఎఫ్) ఎగుమతులపై విధించే పన్నునూ కేంద్రం పెంచింది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా వీటిని పెంచినట్లు తెలిపింది. పెంచిన ఈ పన్నులు ఈ నెల 4 నుంచే అమల్లోకి వచ్చాయి. ఓఎన్‌జిసి వంటి సంస్థలు ఉత్పత్తి చేసే ముడిచమురుపై టన్నుకు రూ.1,900గా ఉన్న విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను ఒక్కసారిగా రూ.5,050కు కేంద్రం పెంచింది. భూగర్భ, సముద్ర గర్భాల నుంచి సేకరించే ముడి చమురు నుంచి పెట్రోల్, డీజిల్, ఎటిఎఫ్ వంటి ఇంధనాలుగా మారుస్తారు. ఎగుమతి చేసే డీజిల్‌పై లీటరుకు రూ.5గా ఉన్న పన్నును రూ.7.5కు ప్రభుత్వం పెంచింది. ఎటిఎఫ్‌పై లీటరుకు రూ.3.5గా ఉన్న పన్నును రూ.6కు కేంద్రం పెంచింది. మనదేశంలో గత ఏడాది జులై 1 నుంచే విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను విధిస్తున్నారు.

బిబిసి డాక్యుమెంటరీపై నిషేధం

పౌర హక్కులను కాలరాయటమే

- దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు చేటు : 500మందికిపైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు



న్యూఢిల్లీ : బిబిసి డాక్యుమెంటరీపై మోడీ సర్కార్ నిషేధం విధించటాన్ని భారత్‌కు చెందిన 500మందికిపైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. మోడీ సర్కార్ తీరు పౌర హక్కులను కాలరాస్తోందని, భారత సార్వభౌమత్వాన్ని, సమగ్రతను దెబ్బతీస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్ అల్లర్ల ఘటనకు ప్రధాన బాధ్యుడు ఆనాటి రాష్ట్ర సిఎంగా ఉన్న నరేంద్రమోడీ.. అని బిబిసి డాక్యుమెంటరీ విశ్లేషించింది. రెండు భాగాలుగా ఈ డాక్యుమెంటరీ రూపొందగా, వీటి ప్రసారాలు భారత్‌లో మోడీ సర్కార్ నిషేధించింది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శిస్తూ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆదివారం ఒక బహిరంగ ప్రకటన విడుదల చేశారు. ఐఐఎస్‌కు చెందిన అరిత్రా ఛటర్జీ, బిట్స్ పిలానీకి చెందిన కింజాల్ బెనర్జీ, కేంబ్రిడ్జ్ వర్సిటీకి చెందిన రోణాక్ సోని..మొదలైనవారు ఉన్నారు. డాక్యుమెంటరీ ప్రసారాలను అడ్డుకోవటం భారత పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయటంగా వారు పేర్కొన్నారు. సమాజం, ప్రభుత్వానికి చెందిన ముఖ్య సమాచారం అందుబాటులో లేకుండా, దానిపై చర్చించకుండా చేయటమే మోడీ సర్కార్ లక్ష్యమని విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు విమర్శించారు. ప్రకటనలో వారు పేర్కొన్న వివరాలు విధంగా ఉన్నాయి. డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకునేందుకు పలు విశ్వవిద్యాలయాల యాజమాన్యం తీసుకున్న నిర్ణయం కూడా సరైంది కాదు. ఇది విద్యా స్వేచ్ఛ సూత్రాలను ఉల్లంఘిస్తోంది. సామాజిక, రాజకీయ సమస్యలపై బహిరంగ చర్చలను వర్సిటీలు ప్రోత్సహించాలి. ప్రజాస్వామ్య సమాజం సక్రమంగా పనిచేయడానికి ఇలాంటి చర్చలు చాలా కీలకం. యూనివర్సిటీలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నందున అభిప్రాయాల వ్యక్తీకరణను అడ్డుకోవటం ఆమోదయోగ్యం కాదు.

జవాబుదారీ ఎవరు?

జవాబుదారీ ఎవరు వహిస్తారన్నది తేలకపోతే, దేశంలో మరిన్ని మత ఘర్షణలు చెలరేగే ప్రమాదముంది. మత ఘర్షణలు, మత విద్వేషాన్ని అడ్డుకోవాలంటే గుజరాత్ 2002 మారణకాండ బాధ్యులెవరన్నది తేలాలి. మత ఏకీకరణతో దేశాన్ని రెండుగా విభజించే శక్తుల్ని ఎదుర్కోవటం చాలా ముఖ్యం. మత ఘర్షణలకు జవాబుదారీ ఎవరు? అని డాక్యుమెంటరీ ప్రశ్నిస్తోంది. ఈనేపథ్యంలో బిబిసి డాక్యుమెంటరీ లేవనెత్తిన ప్రశ్నలు అత్యంత ముఖ్యమైనవి. డాక్యుమెంటరీపై నిషేధం విధించటం ద్వారా బాధితుల గొంతును కేంద్రం అణచివేసింది. గుజరాత్ అల్లర్లపై విశ్వసనీయ సమాచారం అందుబాటులో ఉంది, ఆనాటి భయంకర ఘటనలపై సామాజిక, హక్కుల కార్యకర్తలు కీలక పత్రాలు విడుదల చేశారు. వీటిని చదవాలని బిబిసి డాక్యుమెంటరీ చూసిన వీక్షకుల్ని శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు కోరారు.

చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని అడ్డుకోండి

- సుప్రీంకోర్టుకు చిదంబరం విజ్ఞప్తి

న్యూఢిల్లీ : చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని ఇక నుంచైనా నిరోధించాలని సుప్రీంకోర్టుకు కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు పి.చిదంబరం విజ్ఞప్తి చేశారు. 2019 జామియా నగర్ అల్లర్ల కేసులో 11 మందిని నిర్దోషులుగా సుప్రీంకోర్టు శనివారం విడుదల చేసింది. పోలీసులు వీరిని 'బలిపశువులు'గా మార్చారని కూడా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విచారణకు ముందే శిక్షను విధించే నేర న్యాయ వ్యవస్థ రాజ్యాంగానికి అవమానకరమని చిదంబరం ఆదివారం ట్వీట్ చేశారు. 'ఈ కేసుకు కోర్టుకు ముగింపు పలికింది. అయితే ఇందులో కొందరు నిందితులు దాదాపు మూడేళ్ళ జైలులో ఉన్నారు. ఇది విచారణకు ముందే శిక్ష వంటింది', 'విచారణకు ముందే ప్రజలకు శిక్ష విధించడానికి పోలీసులు అత్యుత్సాహంతో పనిచేస్తారు. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు' అని చిదంబరం వరస ట్వీట్లతో ప్రశ్నించారు. 'విచారణకు ముందే శిక్ష విధించడం మన న్యాయ వ్యవస్థ, రాజ్యాంగానికి అవమానకరం. చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని సుప్రీంకోర్టు ముగింపు పలకాలి. ఇది ఎంత త్వరగా అయితే అంత మంచిది' అని చిదంబరం తెలిపారు.

ఇక ఆర్‌టిఐ నిర్వీర్యం!

- డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లులో వివాదాస్పద సెక్షన్లు
- ఈ బిల్లు చట్టంగా మారితే ఆర్‌టిఐ ఉన్నా లేనట్టే : సమాచార హక్కు కార్యకర్తలు

న్యూఢిల్లీ : మోడీ సర్కార్ తీసుకొచ్చిన 'డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లు'పై సామాజిక కార్యకర్తలు, సమాచార హక్కు కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డాటా ప్రొటక్షన్ బిల్లు ద్వారా ఆర్‌టిఐ చట్టాన్ని నిర్వీర్యం చేయాలన్నదే మోడీ సర్కార్ వ్యూహమని, అందుకోసం ముసాయిదా బిల్లులో వివాదాస్పద సెక్షన్లు పెట్టారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ డాటా ప్రొటక్షన్ ముసాయిదా బిల్లును చట్టంగా మార్చేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. దీంతో ఈ అంశం అటు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ముసాయిదా బిల్లు ఒకవేళ చట్టరూపం దాల్చితే ఆర్‌టిఐ హక్కు ఉన్నా లేనట్టేనని హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. ఆర్టీఐ చట్టం, ఇతర చట్టంలోని అంశాల్ని అతిక్రమిస్తూ డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లులోని సెక్షన్ 29(2)ను కేంద్రం రూపొందించింది.

ఆర్‌టిఐలోని పలు నిబంధనల్ని, అంశాల్ని సవరించాలని సెక్షన్ 30(2) ప్రతిపాదిస్తోంది. సమాచార వెల్లడిలో అనేక మినహాయింపులు కల్పిస్తోంది. పౌరుల వ్యక్తిగత, గోప్యతకు ముడిపడిన సమాచారం కోరరాదని ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె) చెబుతోంది. అయినా ఆర్టీఐ చట్టంలోని అత్యంత కీలకమైన సెక్షన్ 8(1)(జె)ను సవరించాలని డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లు ప్రతిపాదించింది. దీనివల్ల ప్రజలెవరైనా ప్రభుత్వం నుంచి సమాచారం కోరితే, అది 'వ్యక్తిగత' సమాచారం అంటూ ప్రభుత్వ అధికారులు సమాచార విడుదల నిరాకరించవచ్చు. పౌరుల గోప్యత, వ్యక్తిగత సమాచారానికి ఆర్‌టిఐ చట్టం ఎన్నడూ భంగం కలిగించలేదని హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. 'వ్యక్తిగత సమాచారం, గోప్యత' పేరుతో ఆర్‌టిఐ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లులోని పలు సెక్షన్లే ఇందుకు ఉదాహరణ అని కార్యకర్తలు వివరించారు.



బాల్య వివాహాల కేసులో నిందితుల్ని అరెస్టు చేసి తీసుకుని వెలుతున్న పోలీసులు, మోరీగాన్ పోలీస్‌స్టేషన్ బయట బంధువుల ఆందోళన

బాల్య వివాహాల పేరుతో

2,200 మందికి పైగా అరెస్టు

- ఆందోళన చేసిన మహిళలపై లాఠీఛార్జి
- అసోం సర్కారు తీరుపె కుటుంబ సభ్యుల ఆగ్రహం

న్యూఢిల్లీ : బాల్య వివాహాల కేసుల్లో అస్సాంలోని బిజెపి ప్రభుత్వం అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తోంది. గత రెండు రోజుల్లో 2,200 మందిని అరెస్టు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. తమ ఇష్టపూర్వకంగానే వివాహాలు జరిగాయని, తమవారిని విడిచిపెట్టాలని మహిళలు చేస్తున్న అభ్యర్ధనలను పోలీసులు పట్టించుకోవడం లేదు. పోలీస్‌స్టేషన్ల ముందు గుమిగూడుతున్న మహిళలపై పోలీసులు పలుచోట్ల లాఠీఛార్జి చేశారు. పోలీసుల అరెస్టులతో కుటుంబాలు విడిపోతున్నాయని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాల్య వివాహాల అణిచివేత


తన తండ్రిని విడిచి పెట్టాలని ప్లకార్డ్ చూపుతున్న చిన్నారి

ప్రణాళికను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గత నెలలో ప్రకటించారు. 15 రోజుల్లో బాల్యవివాహాలపై 4,004 కేసులను పోలీసులు నమోదు చేశారని, ఈ నెల 3 నుంచి దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. 14 ఏళ్లలోపు వయసున్న బాలికలను వివాహం చేసుకున్న వారిపై లైంగిక నేరాల నుంచి చిన్నారుల రక్షణ (పోక్సో) చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 కింద కేసులను నమోదు చేస్తున్నామని, 18 ఏళ్లలోపు వారిని పెళ్లి చేసుకున్న వారిపైనా కేసులు పెడుతున్నామని అస్సాం ప్రభుత్వం చెబుతోంది. బాల్య వివాహం చేసుకున్న వారిని అరెస్టు చేస్తామని, వివాహాలు అక్రమమని ప్రకటిస్తామని తెలిపింది. వివాహం చేసుకున్న బాలుడు కూడా 14 ఏళ్లలోపు వాడైతే రిఫార్మ్ హౌస్‌కు పంపుతామని ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకూ ఈ కేసుల్లో 2,200 మందికిపై వ్యక్తులను అరెస్టు చేసింది. మైనర్లుగా పెళ్లి చేసుకుని, ఇప్పుడు పెద్దలుగా మారిపోయి, కొంతమంది పిల్లలకు తండ్రులైన వారిని కూడా పోలీసులు అరెస్టు చేస్తున్నారు. కుటుంబాల్లో ప్రధాన సంపాదనపరుడైన వ్యక్తిని అరెస్టు చేయడంతో ఆ కుటుంబాలు వీధిన పడుతున్నాయి. బిజెపి ప్రభుత్వం చేస్తున్న ఈ అరెస్టులపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. బాల్య వివాహాలపై ఇంతకాలం ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని వారు ప్రశ్నిస్తున్నారు.



జెఇ, ఎఇ పేపర్ లీక్ కేసులో బిజెపి నేత అరెస్టు

- ఉత్తరాఖండ్ ఉద్యోగ నియామకాల్లో కాషాయ పార్టీ అక్రమాలు

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లో అవినీతి, కుంభకోణాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజ్‌లు అక్కడ సర్వసాధారణంగా మారాయి. సిఎం పుష్కర్‌సింగ్ ధామి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మరో వివాదంలో చిక్కుకుంది. ఉత్తరాఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జూనియర్ ఇంజనీర్ (జెఇ), అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఇ) పరీక్ష పేపర్ లీక్ కేసులో బిజెపి మండల్ ప్రెసిడెంట్ సంజయ్ ధరివాల్ ప్రధాన నిందితుడిగా కేసు నమోదైంది. అతనితోపాటు మరో 9మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సంజయ్ ధరివాల్ మధ్యవర్తిగా వ్యవహరించాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్న 9మంది వెనుక రూర్కీకి చెందిన మరో బిజెపి నాయకుడు ఉన్నాడని తెలిసింది.

ఈ కేసు వివరాల్ని ఎస్‌ఎస్‌పి హరిద్వార్ అజయ్ సింగ్ మీడియాకు తెలుపుతూ, "పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జెఇ, ఎఇ పరీక్షల్లో ప్రశ్న ప్రతాన్ని లీక్ చేశారన్నది ముఖ్యమైన ఆరోపణ. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముగ్గురు నిందితులు సంజీవ్‌కుమార్, నితిన్ చౌహాన్, సునీల్ సైనీలను అదుపులోకి తీసుకొని విచారణ జరిపింది. పెద్ద మొత్తంలో నగదు ,వివిధ బ్యాంకుల ఖాళీ చెక్కులు వారి వద్ద ఉన్నాయి. ఈ కేసులో బిజెపి నాయకుడు సంజయ్ ధరివాల్ పాత్రపై పోలీసులకు పలు అనుమానాలున్నాయి" అని అన్నారు. ఈ సంగతి మీడియాలో విడుదల కాగానే ధరివాల్ తన పార్టీ పదవికి రాజీనామా చేశారు.

పేపర్ లీకేజీ కేసు ఉత్తరాఖండ్‌లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కుంభకోణంలో పోలీసులు మీడియాకు విడుదల చేసిన పేర్లు బిజెపికి చెందిన వారివే కావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. పేపర్ లీకేజీతో సంబంధమున్న హకీం సింగ్‌ను అరెస్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న తరుణంలో బిజెపి నాయకుడు సంజయ్ ధరివాల్ పేరు తెరపైకి వచ్చింది. "ఈ కుంభకోణంలో బిజెపి నాయకుల పాత్రను తాజా పరిణామం బయటపెట్టింది. ఆ పార్టీ సీనియర్ నాయకులు ఈ పేపర్ లీకేజ్ కుంభకోణం వెనుక ఉన్నారు" అని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గరీమా మహారా డాసోని అన్నారు. ఈ కేసులో ఇప్పటివరకూ 54 మంది నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు.



త్రిపురలో సిపిఎం విస్తృత ప్రచారం

అగర్తల : ఈ నెల 16న ఎన్నికలు జరిగే త్రిపురలో సిపిఎం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. సిపిఎం అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తుంది. బోర్జల అసెంబ్లీ నియోజకవర్గంలో వామపక్ష అభ్యర్థి సుదీప్ సర్కార్‌కు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రచారం నిర్వహించారు. ఇక్కడ ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. సిపిఎంకి ఓటు వేసి బిజెపి గూండాయిజం నుంచి త్రిపురను రక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతాప్‌గఢ్ నియోజకవర్గంలోనూ మాణిక్ సర్కార్ ప్రచారం నిర్వహించారు. ఇక్కడ లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి రాము దాస్‌కు అనుకూలంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది యువకులు, ప్రజలు ఎర్ర జెండాలతో ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.అమర్‌పురా నియోజకవర్గంలోనూ లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి పరిమళ్ దేవనాథ్‌కు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రైమావళి అసెంబ్లీ నియోజకవర్గంలో వామపక్ష అభ్యర్థికి ప్రజల నుంచి మద్దతు లభిస్తుంది.

కొండచరియలు విరిగిపడటంతో కూలిన వంతెన...

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్ లూనా ప్రాంతంలో జాతీయ రహదారి 154ఎ మార్గంలోని వంతెనపై ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో, బ్రిడ్జి పూర్తిగా కూలిపోయింది. చంబా-భర్మౌర్ జాతీయ రహదారికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. చంబా జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లారు. కొండచరియలు విరిగిపడటంతో 20 మీటర్ల పొడవైన బ్రిడ్జి కూలిందని చంబా డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఒక కారు, లారీ లోయలో పడినట్లు చెప్పారు. వంతెన కూలడంతో జాతీయ రహదారి కనెక్టవిటీ పూర్తిగా దెబ్బతిన్నదని వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరలైంది.

భారత్-బ్రిటన్ సంబంధాలపై రిషి ప్రత్యేక శ్రద్ధ!

లండన్: భారత్‌తో బ్రిటన్ సంబంధాలపై ఆ దేశ ప్రధాని రిషి సునాక్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. వాణిజ్యం, రక్షణ వంటి రంగాల్లో ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత వృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని లండన్‌లో భారత హైకమిషన్ ట్వీట్ చేసింది. ఈ ట్వీట్ ప్రకారం.. ఇటీవల అమెరికా పర్యటనలో పాల్గొన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ స్వదేశానికి తిరిగివస్తూ లండన్ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఇంగ్లండ్ జాతీయ భద్రత సలహాదారు టిమ్ బారోతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రిషి సునాక్ కొద్ది సేపు పాల్గొన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని అజిత్ దోవల్‌కు హామీ ఇచ్చారు.

క్వెట్టాలో భారీ పేలుడు...

- అనేక మందికి గాయాలు

ఇస్లామాబాద్ : ఇప్పటికే సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ ఉగ్రవాద దాడులతో తల్లడిల్లుతోంది. ఆదివారం బలూచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతగల ప్రాంతంలో భారీ బాంబు పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో అనేకమంది గాయపడినట్లు పాకిస్థాన్ మీడియా తెలిపింది. వీరిలో ఐదుగురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. క్వెట్టా పోలీస్ ప్రధాన కార్యాలయం సమీపంలోని క్వెట్టా కంటోన్మెంట్ ప్రవేశం (ఎఫ్‌సీ మూసా చెక్‌పాయింట్) వద్ద ఆదివారం ఉదయం భారీ బాంబు పేలుడు సంభవించిందని పాక్ మీడియా తెలిపింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను బలూచిస్థాన్ పోస్ట్ ట్వీట్ చేసింది. పేలుడు జరిగిన వెంటనే పెద్ద ఎత్తున పొగ, ధూళి వ్యాపించినట్లు ఈ వీడియోలో కనిపిస్తోంది. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, సహాయ కార్యకలాపాలు ప్రారంభించారు. సహాయ కార్యకలాపాల్లో పాల్గొంటున్న జీషన్ అహ్మద్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ, క్షతగాత్రులను క్వెట్టాలోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. పోలీసులు, అత్యవసర సమయాల్లో సేవలందించే బృందాలు చేరుకున్నాయని, సంఘటన స్థలాన్ని స్వాధీనంలోకి తీసుకున్నాయని చెప్పారు.

కమాండో నుంచి అధ్యక్షుడి వరకూ..

ముషారఫ్ వివాదాస్పద ప్రస్థానం



న్యూఢిల్లీ: పర్వేజ్ ముషారఫ్ కమాండో నుంచి పాకిస్థాన్ సైనిక పాలకుడి వరకూ వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఆదివారం అమిలోయిడోసిస్ అనే అరుదైన వ్యాధితో దుబాయ్‌లో ఆయన మరణించినట్లు పాక్ వర్గాలు పేర్కొన్నాయి. 2018 నుంచి ఆయన ఈ వ్యాధితో బాధపడుతున్నారు. వైద్య చికిత్స నిమిత్తం 2016 మార్చిలో దుబాయ్ వెళ్లిన ఆయన అప్పటి నుంచి అక్కడే ఉన్నారు. 1943 ఆగస్టు 11న ఢిల్లీలో జన్మించారు. ఆయన బాల్యంలో కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూలులో చదివారు. ఆ తర్వాత లాహోర్‌లోని ఫోర్మన్ క్రిస్టియన్ కాలేజీలో ఉన్నత చదువులు చదివారు. ఆ తర్వాత బ్రిటన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌లో చదివారు. 1961లో పాకిస్థాన్ మిలిటరీ అకాడమీలో చేరారు. పాకిస్థాన్ ఆర్మీలో 1964లో చేరారు. 1965లో భారత్-పాకిస్థాన్ యుద్ధం సమయంలో ఆయన సెకండ్ లెఫ్టినెంట్ హోదాలో ఉన్నారు. 1998లో అప్పటి పాకిస్థాన్ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ హయాంలో రక్షణ దళాలకు అధిపతి అయ్యారు. 1999లో ఆయన హయాంలో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించింది. షరీఫ్, ముషారఫ్ మధ్య సంబంధాలు దెబ్బతినడంతో ముషారఫ్‌ను ఆర్మీ చీఫ్ పదవి నుంచి తొలగించేందుకు షరీఫ్ ప్రయత్నించారు. దీంతో ముషారఫ్ నేతృత్వంలో సైన్యం తిరుగుబాటు చేసి, 1999లో షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసింది. 1998 నుంచి 2001 వరకు ఛైర్మన్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీగా వ్యవహరించారు. షరీఫ్‌ను గృహ నిర్బంధం చేశారు. ఆయన 2001 జూన్ 20 నుంచి 2008 ఆగస్టు 18 వరకు పాకిస్థాన్ దేశాధ్యక్షునిగా పని చేశారు. 2008లో ఎన్నికల అనంతరం అభిశంసనను ఎదుర్కొన్న ముషారఫ్ దేశాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి గృహ నిర్బంధంలో ఉన్న ఆయన వైద్య చికిత్స కోసం దుబాయ్ వెళ్లేందుకు 2016లో అనుమతి పొందారు. 2016 మార్చిలో దుబాయ్ వెళ్లిన తర్వాత అక్కడే ఉండిపోయారు. 2007లో రాజ్యాంగాన్ని సస్పెండ్ చేసినందుకు ముషారఫ్‌పై దేశద్రోహం కేసు నమోదైంది.

ఈ కేసులో కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. తర్వాత కోర్టు తీర్పును రద్దు చేసింది. పాక్ మాజీ ప్రధాన మంత్రి బేనజీర్ భుట్టో హత్య, రెడ్ మాస్క్ క్లరిక్ హత్య కేసుల్లో ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఆయన దేశం నుంచి పరారైనట్లు పాక్ ప్రకటించింది. నవాజ్ షరీఫ్ ప్రభుత్వం ముషారఫ్‌పై తీసుకున్న చర్యలన్నీ రాజ్యాంగ విరుద్ధమని లాహోర్ హైకోర్టు 2020లో ప్రకటించింది. ఆయన పాలనలో మానవ హక్కులు తీవ్రంగా ఉల్లంఘనకు గురయ్యాయని 2013లో హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. ముషరఫ్ కుటుంబ సభ్యులకు పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ తన సానుభూతి తెలియజేశారు.



మీకోసం

చెంచా నెయ్యి వేసి పెరుగుపచ్చడి తాలింపు పెడితే చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

JEEVANA జీవన the family

కాలుష్యం!



కాలుష్యం! కాలుష్యం!
జగమంతా కాలుష్యం
దాని కోరల్లో మనిషి
భవితవ్యం ప్రశ్నార్థకం!

గాలిలోన కాలుష్యం
నీటిలోన కాలుష్యం
సర్వత్రా కాలుష్యం
దాపురించెను నాశనం


ఆరోగ్యం క్షీణించెను
రోగాలు చేరువాయెను
మానవాళి మనుగడకు
పెనుముప్పు వాటిల్లెను

వృక్షాలను నరికితే
మన భూమి వల్లకాడు
ఓజోన్ పొరకు విఘాతం
కళ్ళుతెరిచి ఇక చూడు

మొక్కలెన్నో నాటాలోయ్!
వృక్షాలను పెంచాలోయ్!
పర్యావరణ రక్షణకు
చేయి చేయి కలపాలోయ్!

- గద్వాల సోమన్న
99664 14580

అవి ఏవీ?




చిన్నారులూ, పై వరుసలో ఉన్న జీవుల్లో ఒకటి, కింది వరుసలో ఉన్న జీవుల్లో మరొకటి ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.

జవాబు : 4-7

నేను గీసిన బొమ్మ



- సిహెచ్. నవదీప్,
1వ తరగతి,
గాదీవారిగూడెం,
గంపల గూడెం మండలం,
ఎన్‌టిఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రతికూల స్థితి నుంచి పతాక స్థాయికి ...

ఇరవై ఐదేళ్ల క్రితం దేవేందర్ పాల్ జీవితంలో ఊహించని ప్రమాదం ఎదురైంది. కార్గిల్ యుద్ధంలో కాలు పోగొట్టుకున్నాడు. శరీరం నిండా తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రాణానికి ప్రమాదం అన్నారు వైద్యులు. కానీ, దేవేందర్ చావుతోనూ యుద్ధం చేశారు. కాలు లేకపోయినా నింగి దాకా ఎగురుతున్నారు. అనేక సాహసాలతో ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు. అంగవైకల్యంలో సోలో స్కైడైవర్‌గా ఆసియాలోనే మొదటి వ్యక్తిగా, మారథాన్ రన్నర్‌గా, ప్రేరణాత్మక వక్తగా గుర్తింపు పొందాడు.





దేశ ప్రజలకు రక్షణగా నిలవాలన్న కోరిక, సైనికుడిగా విధినిర్వహణ చేయాలన్న సంకల్పం దేవేందర్‌ను ఆర్మీలో చేరేలా చేసింది. శిక్షణను పూర్తి చేసి జమ్మూ కాశ్మీర్‌లో అఖ్నూర్ ప్రాంతంలో 24 ఏళ్ల క్రితం పోస్ట్ వచ్చింది. కొన్ని నెలల తర్వాత ఒక రోజు శత్రువులతో యుద్ధం చేయాల్సి వచ్చింది. ఆ కాల్పుల్లో దేవేందర్ ఉన్న ప్రదేశం నుంచి 1.5 మీటర్ల దూరంలో ఒక మోర్టార్ పేలింది. దాంతో అతని కుడి కాలు సగభాగం చీలి దూరంగా పడింది. ఒంటినిండా గాయాలు. చెవి, ముక్కుల గుండా రక్తం, శరీర భాగాల నుంచి తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆయన్ని తోటి సైనికులు వైద్యుల దగ్గరకు తీసుకెళ్లారు. దేవేందర్ పరిస్థితి చూసి డాక్టర్లు అతను కోలుకోవడం కష్టమని, బతికి బట్ట కట్టడం కష్టమేనని చెప్పారు. శరీరానికి 73 చోట్ల కుట్లు వేశారు. పాక్షిక వినికిడి లోపం, తీవ్రంగా ప్రభావితమై నాడీ వ్యవస్థ.. మోచేయి, పక్కటెముకలు విరిగాయి. పొట్టభాగంలో రెండు శస్త్రచికిత్సలు జరిగాయి.

అయినా సైనికుడిగా జీవించాలన్న అతని సంకల్పం మృత్యువుని తరిమేసింది. రోజులు గడిచేకొద్దీ కొద్ది కొద్దిగా అతని ఆరోగ్యం మెరుగుపడసాగింది. కదలలేని స్థితిలో కూడా విధులు నిర్వహించలేక పోతున్నానన్న బాధ వెంటాడింది. తన జీవితంలో చోటుచేసుకున్న ఈ ఆకస్మిక మలుపును అధిగమించాలని నిర్ణయించుకున్నాడు. తనకు ఎదురవుతున్న ప్రతి విషయాన్ని సానుకూల దృక్పథంతో చూడటం మొదలుపెట్టాడు. కృత్రిమ కాలుతో నడిస్తే చాలు అనుకోలేదు. పరిగెత్తడం ప్రారంభించాడు. ఎత్తైన రోడ్ల మీద, కచ్చా, పక్కా రోడ్ల మీద, పర్వాతారోహణలపై కూడా పరిగెత్తాడు. 'బ్లేడ్ రన్నర్ ఆఫ్ ఇండియా'గా అవార్డు అందుకున్నారు. నాసిక్‌లో ఆర్మీ అడ్వెంచర్ వింగ్‌లో తిరిగి శిక్షణ తీసుకున్నాడు. ఉదయం, మధ్యాహ్నం తరగతులకు హాజరవుతూ సాయంత్రం వేళల్లో రన్నింగ్, శారీరక వ్యాయామాలతో నెలలు గడిపాడు. స్విమ్మింగ్ చేస్తూ సముద్రంలో లోతైనా ప్రదేశాలకూ వెళ్లాడు. తన జీవితంలో జరిగిన సంఘటన, తాను సాధించిన విజయాలు గురించి వివరిస్తూ మోటివేటర్‌గా మారాడు. యువతకు ప్రేరణ ఇచ్చే వక్తగా పేరు సంపాదించాడు.

ఆకాశంలోనూ విహరిస్తూ ...

మోటివేషన్ స్పీకర్‌గా ఒకసారి దుబాయ్‌లోని స్కైడైవింగ్ పాఠశాలకు వెళ్లాడు అక్కడ సాధారణ వ్యక్తులు ఆకాశంలో ఎగరడం చూసి తానూ అలా చేయాలనుకున్నారు. పారాచూట్‌తో ఆకాశంలో ఎగరడం, తిరిగి నేలపై దిగడం అనేది కష్టంతో కూడుకున్న పని. శరీరాన్ని జాగ్రత్తగా బ్యాలెన్స్ చేయగలగాలి. అయినా స్కైడైవింగ్ శిక్షణ తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే, శిక్షణ ఇవ్వటానికి ఎవరూ సిద్ధపడలేదు. ఆ వైపుగా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఎట్టకేలకు ఎందరినో ఒప్పించి నాసిక్‌లో స్కైడైవింగ్‌లో చేరాడు. కానీ ఒక కాలు లేని వ్యక్తికి శిక్షణ ఇవ్వడం చాలా కష్టమని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వెనకడుగు అధికారులు తొలుత భయపడ్డారు. కానీ, ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ రావత్- దేవేందర్ పట్టుదలను చూసి శిక్షణకు అనుమతి ఇచ్చారు. దాంతో ఐదేళ్ల క్రితం ట్రైనింగ్ ప్రారంభించారు. గాలిలో విహరిస్తున్నప్పుడు పరిస్థితుల రీత్యా స్పిన్నింగ్ చేయాల్సి వస్తోంది. ఆ క్రమంలో స్పిన్‌లో పారాచూట్ దేనికైనా చిక్కుకున్నా, ల్యాండింగ్‌కు శరీరం సరైన పొజిషన్‌లో లేకుంటే దెబ్బలు తగులుతాయి. అయినా దేవేందర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ధైర్యంగా గాలిలో ఎగిరేందుకు సిద్ధమయ్యాడు. శిక్షణలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. మరింత పట్టుదలగా ముందుకు వెళ్లాడు. మూడేళ్ల క్రితం 12,500 అడుగుల ఎత్తు నుంచి తన మొదటి సోలో డ్రైవ్‌ని విజయవంతంగా చేసి అధికారుల చేత శభాష్ అనిపించుకున్నాడు. ఇండియా ఆర్మీ డిసేబుల్ సోలో స్కైడైవర్‌గా గుర్తింపు పొందాడు. ఇలాంటి ఎన్నో సాహసోపేతమైన విన్యాసాలు చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు.

చుండ్రు వదిలించండిలా

జుట్టు రాలడానికి ప్రధాన సమస్య చుండ్రు. ఈ కాలంలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. తల అంతా దురద వచ్చి కుచ్చుకుచ్చులుగా జుట్టు రాలిపోయేలా చేస్తుంది. జుట్టు బాగా పలచబడి బలహీనంగా మారుతుంది. చుండ్రు అనేది మూడు కారణాల వల్ల వస్తుంది. శరీరంలో హార్మోన్లు హెచ్చుతగ్గులు అయినా, వాడుతున్న నూనెలో సమస్య ఉన్నా, పొడి గాలి, తక్కువ తేమ కారణంగా తలపై చుండ్రు ఎక్కువగా వస్తూ ఉంటుంది. దీన్ని వెంటనే తొలగించకుండా ఉంటే వెంట్రుకలన్నీ ఊడిపోతాయి.

నివారణ

- కప్పు పెరుగు తలకు పెట్టి అరగంట తర్వాత కడిగివేయాలి. వారంలో రెండు, మూడు సార్లు చేస్తే చుండ్రు తగ్గిపోతుంది.
- వేప ఆకులను శుభ్రంగా కడిగి, మెత్తగా పేస్ట్ చేయాలి. నిదానంగా తలకు పట్టించాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితోనే తొలగించాలి.
- ఒక కప్పు కలబంద గుజ్జును తీసుకుని, మెత్తగా మిక్సీ పట్టి తలంతా పట్టించాలి. గంట తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపుతో తలస్నానం చేయాలి.
- మెంతి గింజలను రాత్రంతా నానబెట్టండి. ఉదయం వాటిని పేస్ట్ చేసి దానిలో కొద్దిగా కలబంద గుజ్జు కలపాలి. తలపై అప్లై చేసి, గంట తర్వాత షాంపుతో కడగాలి. ఇలా వారానికి ఒకసారి చేయడం వల్ల చుండ్రు తగ్గి జుట్టు నల్లబడుతుంది. బాగా పెరుగుతుంది.
- నిమ్మకాయ రసం జుట్టుకు బాగా పనిచేస్తుంది. రెండు రోజులకొకసారి నిమ్మరసం పెడుతూ ఉంటే తల్లో దురద, పుండ్లు ఉన్నా వెంటనే తగ్గుతాయి.
- ఇవన్నీ చేస్తున్నా చుండ్రు తగ్గటం లేదంటే హార్మోన్ల పరీక్ష చేయించుకోవాల్సిందే. వైద్యుల సూచన మేరకు మందులు వాడితే చుండ్రు తగ్గుతుంది.
- ప్రతిరోజూ వ్యాయామం చేసినా, తల్లో చెమట పట్టినా వెంటనే జుట్టును కూడా శుభ్రం చేసుకోవాలి.



- వీటితో పాటు తలకు పూసే నూనెలో ఔషధాలు ఉండేలా కొబ్బరినూనెను ఇంట్లోనే తయారుచేసుకోండి.
- తీసుకునే ఆహారంలో పోషక పదార్థాలు, విటమిన్లు ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.

ఆమె ప్రాధాన్య పాత్రలు పెరగాలి



సమాజాభివృద్ధిలో స్త్రీల పాత్ర ఎంతో ఉంది. తమను తాము నిరూపించుకుంటూ ఎనలేని శక్తిమంతురాళ్లుగా ఎదుగుతున్నారు. ఇల్లు, కార్యాలయమే కాదు.. ఏ రంగంలో అడుగిడినా ప్రత్యేకస్థానంలో దూసుకుపోతున్నారు. నిత్యం దాడులు, హింస ఎదుర్కొంటూనే ఉన్నత స్థానాలకు ఎగబాకుతున్నారు. ఇలా ఒకపక్క సమాజంలో స్త్రీలు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ ఎంతో ప్రాధాన్యత గలవారిగా ఉంటుంటే చిత్రసీమలో మాత్రం ఆమెను చాలా తక్కువచేసి చూపిస్తున్నారు. సమాన పారితోషికం కోసం మాట్లాడే నాయికలు హీరోకు సమానంగా తమకు కూడా సమాన పాత్రలు కల్పించాలని ఎన్నో సందర్భాల్లో తమ గళాన్ని వినిపించారు.



ఈ మధ్యకాలంలో వస్తున్న సినిమాల్లో హీరోయిన్ పాత్రలు చాలా తక్కువ సీన్లకే పరిమితమవుతున్నాయి. హీరో వెంటపడడం, ప్రేమించమని ప్రాధేయపడడం, డబ్బులు ఉన్న హీరో అయితే తన అవసరాలు తీరుస్తారని ఆశపడడం.. ఇలా ఆమె వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా చిత్రీకరిస్తున్నారు.

ఆధునిక సమాజంలో స్త్రీ పాత్ర గతం కంటే చాలా రెట్లు పెరిగింది. ఆ స్థాయిలో సినిమాల్లో కూడా ఆమె పాత్రలు ఉండాలి. కాని దురదృష్టకరంగా సినిమా అంతా హీరో, హీరోయిజంపైనే దృష్టి పెడుతున్నారు. సమంతా, రకుల్ ప్రీత్ సింగ్, పూజాహెగ్డే, రష్మిక, కాజల్, నయనతార, శృతి హాసన్, కీర్తి సురేష్ ఇలా ఈ మధ్యకాలంలో వస్తున్న హీరోయిన్లు నటిస్తున్న సినిమాల్లో వాళ్ల పాత్రల నిడివి చాలా తక్కువగా ఉంటోంది.

'అల వైకుంఠపురంలో' పూజ పాత్ర రెండు, మూడు సన్నివేశాలకు, పాటలకే పరిమితమౌతుంది. 'సర్కారు వారి పాట' చిత్రంలో కీర్తి సురేష్‌ను డబ్బు కోసం ఏదైనా చేస్తుంది అన్న పాత్రలో చూపిస్తారు. 'రంగ స్థలం' చిత్రంలో సమంత పాత్ర కూడా పాటలకే పరిమితమైనట్లు కనిపిస్తుంది. 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో అందమైన అబ్బాయిల కోసం ఎంతకైనా తెగించే అమ్మాయిగా రష్మిక పాత్ర కనిపిస్తుంది. ఇక ఇటీవల విడుదలైన 'వీర సింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య' చిత్రాలలో శృతిహాసన్ పాత్ర నిడివి మొత్తం నిమిషాల వ్యవధికే పరిమితమైంది. 'ఆచార్య' చిత్రంలో కాజల్ పాత్ర నిడివి చాలా తక్కువని, ఆమె లేకపోయినా పరవాలేదంటూ ఏకంగా ఆ పాత్రనే సినిమాలో కనిపించకుండా చేశారు. ఇక పాటలకే పరిమితమౌతున్న హీరోయిన్లు చాలామందే ఉన్నారు.





కొన్ని సినిమాల్లోనైతే మహిళా పాత్రలను క్రూరంగా చూపించడం మొదలుపెట్టారు. 'వీర సింహారెడ్డి' చిత్రంలో బాలకృష్ణకు దీటుగా నటించే అవకాశాలున్న పాత్రలో వరలక్ష్మి శరత్‌కుమార్ కనిపిస్తారు. అయితే ఆమె పాత్ర నెగిటివ్ షేడ్స్‌లో ఉంటుంది. 'బాహుబలి' చిత్రంలో రమ్యకృష్ణ పాత్ర చాలా శక్తిమంతంగా చూపిస్తూనే ఆమెకు నెగిటివ్ టచ్ ఇచ్చారు.

మహిళ ప్రాధాన్యత పెరిగే సినిమాలంటే.. వారే ప్రధాన కేంద్రంగా తెరకెక్కే సినిమాలు కాదు.. హీరో, హీరోయిన్లకు సమాన పాత్రలు కల్పించాలి. ఇద్దరు హీరోలతో సినిమాలు చేసే దర్శకులు వారికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. ఉదాహరణకు ప్రపంచ స్థాయిలో రికార్డులు కొల్లగొడుతున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో రామ్‌చరణ్, ఎన్‌టిఆర్‌లకు సమాన హోదా కల్పించిన దర్శకుడు హీరోయిన్ అలియాభట్ దగ్గరకు వచ్చేసరికి చాలా చిన్న పాత్రకే పరిమితం చేశారు. అసలు కథను రాసుకునేటప్పుడే రచయితలు ఆమె పాత్రకు ప్రాధాన్యత ఇవ్వకపోవడమో.. లేక సినిమాలో ఆ పాత్రను తగ్గించి చూపడమో జరుగుతోంది.

కోమలత్వం, అమాయకత్వం, బేలతనం, నాజుకుతనం ఇవే హీరోయిన్ల లక్షణాలుగా చూపించే దర్శకులు ప్రస్తుతం ఎక్కువగా కనపడుతున్నారు. ఈ ధోరణి సమాజంలో మహిళలను చిన్నచూపు చూసేలా చేస్తుంది. ఆమెను శక్తిమంతురాలిగా చూపనక్కర్లేదు.. కనీసం హీరోతో సమాన ప్రాధాన్యత ఉన్న పాత్రల్లోనైనా చూపించాలి. ఇటీవల మరణించిన కె. విశ్వనాథ్, దాసరి నారాయణ వంటి దిగ్గజ దర్శకుల చిత్రాల్లో స్త్రీ పాత్రలు చాలా ఔన్నత్యంగా కనిపించేవి. ఈతరం దర్శకుల్లో శేఖర్ కమ్ముల చిత్రాల్లో స్త్రీ పాత్రలు చాలా ఉన్నతంగా కనిపిస్తాయి. ఈ ఒరవడి ఇండస్ట్రీ అంతా కొనసాగించాలి. ఆమె పాత్రకు ప్రాధాన్యత పెరగాలి.



నాయకత్వ సవాల్

- **రోహిత్‌కు అతిపెద్ద కెప్టెన్సీ పరీక్ష**
- **బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్**

ప్రజాశక్తి క్రీడావిభాగం :

ఫిబ్రవరి 2022, భారత జట్టు టెస్టు పగ్గాలు రోహిత్ శర్మ చేతికి అందాయి. కాగితంపైనే మూడు ఫార్మాట్ల కెప్టెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ.. నాయకుడిగా రెండు టెస్టులే ఆడాడు. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ ఊరిస్తున్న తరుణంలో టెస్టుల్లో నాయకుడిగా రోహిత్ శర్మ తొలిసారి కఠిన పరీక్ష ఎదుర్కొంటున్నాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ ఫిబ్రవరి 9న నాగ్‌పూర్ టెస్టుతో ఆరంభం కానుంది.

అసలు మొదలైందా?! :

భారత జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ ప్రస్థానం ఏడాది కిందటే మొదలైంది. కానీ నిజానికి భారత క్రికెట్‌లో రోహిత్ శర్మ నాయకత్వ శకం మొదలైందా? అంటే కాదనే చెప్పాలి. వైట్‌బాల్ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ నాయకత్వం కనిపిస్తున్నా.. టెస్టుల్లో అతడు ప్రయాణమే ఆరంభించలేదు. ఆల్‌ఫార్మాట్ కెప్టెన్‌గా భారత్ చివరి ఐదు టెస్టుల్లో రోహిత్ శర్మ ఏకంగా మూడు టెస్టులకు దూరమయ్యాడు. ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్‌లో 2-1 ఆధిక్యం సాధించిన చారిత్రక విజయంలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అంతకుముందే, ఆస్ట్రేలియా గడ్డపై భారత్ చారిత్రక 2-1తో టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత టెస్టుల్లో విదేశీ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. జొహనెస్‌బర్గ్, కేప్‌టౌన్, బర్మింగ్‌హామ్ టెస్టుల్లో భారత్ విజయం సాధించే స్థితిలో ఉండీ పరాజయం పాలైంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో టెస్టుల్లో సాధికారిక విజయాలు నమోదు చేయటంలో తేలిపోయింది. కానీ, స్వదేశంలో టీమ్ ఇండియా రికార్డు దుర్భేద్యం. బలమైన ఆస్ట్రేలియాతో ఒత్తిడితో కూడిన సిరీస్‌లో రోహిత్ శర్మ నాయకత్వ పటిమ తేలనుంది. టెస్టుల్లో నాయకుడిగా రోహిత్ శర్మ ప్రభావం ఈ సిరీస్ తేల్చనుంది.

పొంచిఉన్న ప్రమాదం :

భారత జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ భవితవ్యం ప్రమాదంలోనే కొనసాగుతుంది!. మూడు ఫార్మాట్లలో రోహిత్ శర్మ కెప్టెన్సీ పగ్గాలు కోల్పోయే ప్రమాదంలోనే ఉన్నాడు. టీ20ల్లో హార్దిక్ పాండ్య అనధికార రెగ్యులర్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ అనంతరం రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌లో నాయకత్వం సంగతి అటుంచి, అసలు జట్టులోనే నిలువలేదు. ఇక వన్డే ఫార్మాట్‌లో ఈ ఏడాది స్వదేశంలో ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్ అతడి భవిష్యత్‌ను నిర్ణయించనుంది. సొంతగడ్డ అనుకూలత, టైటిల్ అంచనాలను సైతం మోసుకొస్తుంది. కప్పు నెగ్గాలనే ఒత్తిడి రోహిత్ శర్మపై ఉంటుంది. వరల్డ్‌కప్‌లో ఏమాత్రం తేడా వచ్చినా.. రోహిత్ శర్మ నాయకత్వం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక టెస్టు క్రికెట్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. 35 ఏండ్ల రోహిత్ శర్మ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నెగ్గటంతో పాటు ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు సాధించాల్సి ఉంది.

ఆ సంగతి బాగా తెలుసు! :

జాతీయ జట్టు నాయకుడి గొప్పతనం ద్వైపాక్షిక సిరీస్ విజయాల్లో ఉండదు. ఐసీసీ టోర్నమెంట్‌లో విజయమే నాయకుడి సామర్థ్యానికి కొలమానం. ఈ విషయం చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు బాగా తెలుసు. కెప్టెన్‌గా భారత్‌ను వన్డేల్లో విజయవంతమైన, దూకుడైన ఛేదించే జట్టుగా నిలిపిన రాహుల్ ద్రవిడ్.. నాయకత్వం విషయంలో ఎప్పుడూ 2007 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో గ్రూప్ దశ నుంచి నిష్క్రమించిన జట్టు సారథిగానే కనిపిస్తాడు. ఇదే విషయం రోహిత్ శర్మకు సైతం వర్తించనుంది. 2021 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో నాకౌట్‌కు అర్హత సాధించని టీమ్ ఇండియాను.. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో రోహిత్, ద్రవిడ్ సెమీఫైనల్స్‌కు చేర్చారు. అయితే, వరుస టీ20 ప్రపంచకప్‌లలో టీమ్ ఇండియా పరాజయానికి కారణాలు ఒకటే కావటం గమనార్హం.





వేధిస్తున్న బలహీనతలు :

కీలక బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ ముంగిట, టీమ్ ఇండియా పలు సమస్యలు ఎదుర్కొంటుంది. గత రెండేండ్లుగా భీకర ఫామ్‌లో ఉన్న ముగ్గురు కీలక క్రికెటర్లు దూరమయ్యారు. రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లు పరుగుల వేటలో ముందున్నారు. పంత్ సిరీస్‌కు దూరమవగా.. స్పిన్‌పై అద్భుతంగా అయ్యర్ తొలి టెస్టులో ఆడటం లేదు. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా సైతం అందుబాటులో లేడు. ఈ ముగ్గురు ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతుండటం ప్రత్యర్థి జట్టుకు అనుకూలించే పరిణామం. ఇక స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారలు అంచనాల మేరకు రాణించటం లేదు. 2021 ఆరంభం నుంచి పుజార సగటు 34.61 కాగా, విరాట్ కోహ్లి సగటు 23.85. రోహిత్ శర్మ టెస్టు ఫామ్‌పై ఇప్పుడే ఏమీ చెప్పలేని స్థితి. ఎందుకంటే, మార్చి 2022 తర్వాత రోహిత్ శర్మ ఒక్క టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగలేదు.

నాయకుడిగా నిలబడేనా? :

బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ విజయం సాధించినా, విఫలమైన రోహిత్ శర్మ నాయకత్వ శకం స్వల్పకాలికమే. ఈ సిరీస్ విజయం భారత ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలను నిర్దేశించనుంది. 2013 నుంచి ఐసీసీ టైటిల్‌కు దూరంగా ఉంటున్న టీమ్ ఇండియాకు ఆ లోటు తీర్చేందుకు రోహిత్ శర్మకు వరుసగా మూడు అవకాశాలు ముందున్నాయి. 2023 వన్డే వరల్డ్‌కప్, ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ సహా 2024 టీ20 ప్రపంచకప్‌లో వరుసగా ఉన్నాయి. నాయకుడిగా చరిత్రలో నిలిచేందుకు రోహిత్ శర్మకు ఇందులో ఒక్క విజయం చాలు!. భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత విలువైన, ప్రతిభావంతులైన యువ క్రికెటర్లతో కూడిన టెస్టు జట్టుకు సారథ్యం వహిస్తున్న రోహిత్ శర్మ... స్వదేశంలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని అందుకుంటాడా? ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు సాధిస్తాడా? చూడాలి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68